www.trinetnews.com

త్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 | సంచిక 88 | ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు | శనివారం అక్టోబర్ 31, 2026 | పేజీలు:12 | వెల.10/-

హైదరాబాద్- విజయవాడ హైవేపై కారు దగ్ధం

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కారు దగ్ధమైంది. విజయవాడకు చెందిన తాడేపల్లి ప్రవీణ్ (33) ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం తన భార్యతో కలిసి కారులో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. హైదరాబాద్ శివారులోని బాటసింగారం వద్దకు రాగానే ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. గమనించిన దంపతులు వెంటనే కారు నుంచి బయటకు వచ్చారు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. క్షణాల్లో మంటలు కారు మొత్తం వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది.

భూములు అమ్ముతాం..
బడులు బాగుచేస్తాం!

మియాపూర్ భూములపై సుప్రీం తీర్పు.. సీఎం రేవంత్ కీలక ప్రకటన

- మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ ? భూమిపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకమని వెల్లడి
- భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు
- విక్రయం ద్వారా వచ్చే నిధులతో విద్యావ్యవస్థ బలోపేతం
- మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూముల పరిరక్షణ: సీఎం
- మంచిరేవులలో 143 ఎకరాల భూమి తిరిగి స్వాధీనం
- కేసీఆర్ ఫాంహౌస్ పరిసరాల్లో 388 ఎకరాల భూమి స్వాధీనం
- మరో 345 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు
- ఎర్రవల్లి సమీపంలో శ్రీకాంతాచారి పేరుతో అమరవీరుల కాలనీ

మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ధరణి రికార్డులను తారుమారు చేసి భూములను ఆక్రమించుకోవాలని చూశారని విమర్శించారు.

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భూ ఆక్రమణలపై పోరాటం చేశానని రేవంత్ రెడ్డి తెలిపారు. మియాపూర్ భూముల విషయంలో గతంలో ప్రభుత్వానికి అనుకూలంగా బలమైన వాదనలు వినిపించలేదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశంపై సమర్థంగా వాదనలు వినిపించామని పేర్కొన్నారు. మియాపూర్ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. అవసరమైతే మియాపూర్ భూములను విక్రయించి, ఆ నిధులను విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు వినియోగిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల ద్వారా వచ్చే నిధులను పేదల ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తామని చెప్పారు.

ఐఎంజీ భూముల అంశంలోనూ తమ ప్రభుత్వం బలంగా వాదనలు వినిపించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని చెప్పారు. మంచిరేవులలోని 143 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నించారని సీఎం ఆరోపించారు. ఈ అంశంపై పోరాటం చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అందులో 50 ఎకరాలను యంగ్ ఇండియా స్కూల్‌కు కేటాయించినట్లు వెల్లడించారు. భూపాలపల్లిలోనూ 104 ఎకరాల

మిగతాది 2లో

సింగరేణిలో
బోనస్ బంగారు పంట!

గరిష్ఠంగా రూ.1,10,250

- నవంబర్ 5న కార్మికుల ఖాతాల్లో జమ
- 38 వేల మందికి దీపావళి కానుక
- బోనస్ కోసం రూ.419 కోట్ల విడుదల
- దసరా, దీపావళి కలిపి రూ.1,020 కోట్ల లబ్ధి
- ఒక్కో కార్మికుడికి సగటున రూ.2.65 లక్షల ప్రయోజనం

2లో..

2లో

రైతు ఏడాది ఆదాయం..
ఐటీ ఉద్యోగి నెల జీతం కంటే తక్కువ!

బండి సంజయ్ వ్యాఖ్యలు.. వ్యవసాయ ఆదాయంపై చర్చ

- రైతు అభివృద్ధే మోదీ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి
- పీఎం కిసాన్‌తో ఇప్పటివరకు రూ.4.47 లక్షల కోట్ల పంపిణీ
- తెలంగాణలో 30 లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి
- ఎరువుల సబ్సిడీకి రూ.12 లక్షల కోట్లు ఖర్చు
- ఎల్‌నినోతో 11 లక్షల ఎకరాల్లో సాగు నిలిచిందని వెల్లడి
- ఈ సీజన్‌లో రూ.20 వేల కోట్ల పంట నష్టం అంచనా
- కరువు జాబితాలో మరిన్ని మండలాలను చేర్చాలని డిమాండ్

మియాపూర్ భూములను పరిశీలించిన కలెక్టర్.. శరవేగంగా స్వాధీన ప్రక్రియ

హైదరాబాద్:
రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి రెవెన్యూ మండలంలోని మియాపూర్ సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని సుమారు 550 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీన ప్రక్రియను అధికారులు శరవేగంగా ప్రారంభించారు. రూ.వేల కోట్ల విలువైన ఈ భూములను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి.. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

2లో..

భూములు అమ్మితే ఊరుకోం!

మియాపూర్ భూముల విక్రయంపై బీజేపీ అభ్యంతరం

2లో

- సుప్రీంకోర్టు తీర్పు తర్వాత అమ్మకానికి సిద్ధమా?
- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించిన రాంచందర్‌రావు
- భూములు అమ్మి పాలన సాగించడం సరికాదని వ్యాఖ్య
- స్థానిక అభివృద్ధిపై ముందుగా దృష్టి పెట్టాలని డిమాండ్
- మియాపూర్ భూముల విక్రయానికి బీజేపీ వ్యతిరేకం

2లో

అమిత్ షా తెలంగాణ పర్యటనపై మంత్రి పొన్నం విమర్శలు

- తెలంగాణ అమరవీరులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నవంబర్ 2న అమిత్ షా హైదరాబాద్ పర్యటన
- పాదయాత్ర పేరుతో బీజేపీ హడావుడి చేస్తోందని ఎద్దేవా
- మణిపూర్‌లో పాదయాత్ర చేయాలని సవాల్

హైదరాబాద్:
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు గుప్పించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చే ముందు అమరవీరులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నవంబరు 14 వరకు.. సౌదీకి ఎయిరిండియా విమానాలు రద్దు

సౌదీ అరేబియాలోని ఎయిర్‌పోర్టులు సహా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సౌదీలోని పలు నగరాలకు విమాన సర్వీసులను రద్దు చేసిన ఎయిరిండియా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్..

2 లో

2 లో

తాగునీరు తాగుడుకే..
గ్రీన్ వాటరే ఇతర పనులకు!

నవంబర్ 1 నుంచి హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్లు

- ఎల్‌నినో ప్రభావంతో జలాశయాల్లో తగ్గిన నీటిమట్టాలు
- ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటితో సరఫరా
- నిర్మాణాలు, పరిశ్రమలు, పార్కులకు గ్రీన్ వాటర్
- 10 వేల నుంచి 30 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకర్లు
- తొలి దశలో 300--400 ట్యాంకర్ల నమోదుకు లక్ష్యం
- యాప్ ద్వారా బుకింగ్.. డ్యాష్‌బోర్డ్‌తో పర్యవేక్షణ
- ట్యాంకర్లపై 'తాగడానికి పనికిరాదు' హెచ్చరిక తప్పనిసరి

ఎల్ నినో ప్రభావంతో హైదరాబాద్ కు వచ్చే జలాలు తగ్గిపోవటం, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల్లో నీరు అడుగంటి పోవడంతో జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరపనున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. గ్రీన్ వాటర్ ట్యాంకర్లపై సమీక్ష జరిపిన ఎండీ అశోక్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రీన్ వాటర్ ట్యాంకర్ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు.

2లో..

గీన్ ఎస్ఎం సంస్థను నిషేధించాలి: హైదరాబాద్ లో క్యాబ్, ఆటో డ్రైవర్ల ధర్నా

అంతర్జాతీయ క్యాబ్ సంస్థ గ్రీన్ ఎస్ఎం సంస్థను తెలంగాణ నుంచి పూర్తిగా నిషేధించాలని హైదరాబాద్ లో క్యాబ్ యూనియన్, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో క్యాబ్ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. 2026 అక్టోబర్ 30న హబ్సీగూడలో సంస్థ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో భారీ సంఖ్యలో క్యాబ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. క్యాబ్, ఆటో డ్రైవర్ల ఉపాధికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న సంస్థను తెలంగాణ రాష్ట్రం నుంచి పూర్తిగా నిషేధించాలని ఈ సందర్భంగా తెలంగాణ ఆటో మోటార్ రవాణా రంగ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య డిమాండ్ చేశారు.

2 లో

జిరాక్స్ సెంటర్ ముసుగులో అక్రమ దందా.. పోలీసుల తనిఖీల్లో

రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్ పరిధిలో నకిలీ ఆధార్, పాన్ కార్డులను తయారుచేస్తున్న అక్రమ దందా గుట్టురట్టయింది. ఆధార్, పాన్ కార్డుల్లో అక్రమ మార్పులు చేస్తూ ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్న ఓ జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిని శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, పహాడీషరీఫ్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.

జనవరి 25 నుంచి
దేశవ్యాప్తంగా జనగణన

వచ్చే ఏడాది జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, మంచు తీవ్రత ఉండే ప్రాంతాలు మినహా అన్ని రాష్ట్రాల్లో ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవాలతోపాటు లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్‌లోని మంచు తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జనగణన ఉండదని పేర్కొంది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసింది.జనగణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1ని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మార్చి ఒకటి నుంచి ఐదో తేదీ వరకు సవరణల కోసం సమయం ఇచ్చారు. ప్రజలు స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి జనవరి 24 వరకు వీలు కల్పించారు. ఆన్‌లైన్ లేదా నిర్దేశిత విధానంలో ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి

సింగరేణి కార్మికులకు శుభవార్త..

మొదటిపేజీ తరువాయి

సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సింగరేణి ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది రేవంత్ సర్కార్. ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 దీపావళి బోనస్ ప్రకటించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.
దీపావళి బోనస్ కోసం రూ.419 కోట్లు సింగరేణి యాజమాన్యం విడుదల చేయనుంది. సుమారు 38 వేల మంది సింగరేణి కార్మికులకు బోనస్ అందనుంది. నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో బోనస్ జమ అయ్యే అవకాశం ఉంది.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో బోనస్ చెల్లింపునకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తుంది. నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్(ఎన్‌సీడబ్ల్యూఏ) ఉద్యోగులకు మాత్రమే దీపావళి బోనస్ వర్తించనుంది. అధికారులకు ఈ బోనస్ వర్తించదు. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసిన కార్మికులకు బోనస్ అర్హతగా నిర్ణయించారు.

అర్హత పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయి బోనస్ ఇవ్వనున్నారు. మిగతావారికి పని దినాల ఆధారంగా చెల్లిస్తారు. దీంతో దసరా, దీపావళి బోనస్‌లతో సింగరేణి కార్మికులకు నెల రోజుల్లోనే భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరినట్లయ్యింది. రెండు బోనస్‌ల రూపంలో ఒక్కో కార్మికుడికి సగటున రూ.2.65 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. దసరా, దీపావళి బోనస్‌లతో కలిపి కార్మికులకు సుమారు రూ.1,020 కోట్ల చెల్లిస్తున్నారు.
దీనిలో భాగంగా సింగరేణి కార్మికులకు ముందుగానే దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించి పోటీని అధిగమించాలని సింగరేణి కార్మికులకు సూచించారు. బోనస్ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు పొదుపు చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

తాగునీరు తాగుడుకే..
గ్రీన్ వాటరే ఇతర పనులకు!

మొదటిపేజీ తరువాయి

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటి వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, గ్రీనరీ అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపల్ సంస్థలకు శుద్ధి చేసిన నీటి సరఫరా చేయనున్నారు. పథకాలుచూడండి
నిర్మాణ రంగం, పరిశ్రమలు, ల్యాండ్‌స్కేపింగ్ అవసరాలకు గ్రీన్ వాటర్ సరఫరా చేయనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 31 నాటికి అన్ని ఫిల్లింగ్ పాయింట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. 10 వేల నుంచి 30 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్ల నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రస్తుతం 56 ట్యాంకర్లు, 9 మంది వినియోగదారుల నమోదు చేసినట్లు చెప్పారు. అక్టోబర్ 31 నాటికి 300 నుంచి 400 ట్యాంకర్ల నమోదుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి ట్యాంకర్‌పై 'తాగడానికి పనికిరాదు' హెచ్చరిక తప్పనిసరి ఉండాలని ఆదేశించారు.
అక్టోబర్ 31 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ల బుకింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. యాప్, కమాండ్ కంట్రోల్ డ్యాష్‌బోర్డు ద్వారా బుకింగ్‌లు, సరఫరా పర్యవేక్షిస్తారు. అక్టోబర్ 31న ఎస్టీపీల వద్ద అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు చేస్తారు.

ఫిల్లింగ్ పాయింట్ల వద్ద ట్రయల్ రన్ నిర్వహించాలని ఎండీ ఆదేశించారు. నవంబర్ 1న ఉదయం నుంచే గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సరఫరా ప్రారంభం అవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఫిల్లింగ్ పాయింట్ వద్ద నాలుగైదు ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలన్నారు. తొలి ఐదు రోజుల పాటు 24 గంటల ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.
శుద్ధి చేసిన నీటి పునర్వినియోగంతో భూగర్భ జలాల సంరక్షణ జరుగుతుందన్నారు. తాగునీటిపై ఒత్తిడి తగ్గించడమే గ్రీన్ వాటర్ కార్యక్రమ లక్ష్యంగా చెప్పారు. గ్రీన్ వాటర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతు ఏడాది ఆదాయం ఐటీ ఎంప్లాయి నెల జీతం కంటే తక్కువే: కేంద్రమంత్రి బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

రైతు ఏడాది ఆదాయం ఐటీ ఎంప్లాయి నెల జీతంకంటే తక్కువేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. రైతుల అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. శుక్రవారం (అక్టోబర్ 30) హైదరాబాద్ రాజేంద్రనగర్?లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి జై జవాన్, జై కిసాన్ రెండు కళ్లని అభివర్ణించారు.
ప్రధాని మోడీకి సైనికులు, రైతులు అంటే ఎంతో ఇష్టమన్నారు. 2014తో పోలిస్తే వ్యవసాయ బడ్జెట్ 5 రెట్లు పెంచామని.. రైతును రారాజు చేయడమే మోడీ లక్ష్యమని పేర్కొన్నారు. అందులో భాగంగానే రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని జమ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 23 విడతలుగా రూ.4 లక్షల 47 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి సొమ్మును 92 శాతం మంది రైతులు వ్యవసాయానికే ఖర్చు చేస్తున్నారని తద్వారా 85 శాతం మంది రైతుల ఆదాయం పెరిగిందన్నారు.

ఎరువుల సబ్సిడీ కోసమే 12 లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నామని.. మోడీ ఇచ్చే సబ్సిడీతో రైతులకు ఎకరాకు 18 వేలు ఆదా అవుతోందని చెప్పారు.
తెలంగాణలో 30 లక్షల మందికిపైగా రైతులకు లబ్ది చేకూరుస్తున్నామన్నారు. తెలంగాణలో దాదాపు 40 లక్షల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులిచ్చామని చెప్పారు. 50 వేల కోట్ల రుణాలు, 1 కోటి 10 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు అందించామన్నారు. తెలంగాణపెట్టుబడులు

కాంగ్రెస్ పాలనలో తిండి గింజలు లేక ఇతర దేశాల నుండి బియ్యం గింజలను దిగుమతి చేసుకునే దుస్థితి వచ్చిందన్నారు. మోడీ నిరంతర కృషి, శాస్త్రవేత్తల నిరంతర పరిశోధనల వల్లే వరి ఎగుమతుల్లో ఇండియా ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటే ఐటీయే కాదు, ఐకార్-ఐఐఆర్ఆర్ ఐకాన్?గా మారిందన్నారు. ఎల్ నినోతో దేశవ్యాప్తంగా కరువొచ్చిందని.. తెలంగాణలో 11 లక్షల ఎకరాల్లో పంట వేయలేదని తెలిపారు.
రాష్ట్రంలో ఇంకా చాలా మండలాలను కరువు జాబితాలో చేర్చాలన్నారు. ఈ పరిస్థితుల్లో శాస్త్రవేత్తలు కొత్త వంగడాలను సృష్టించి రైతులను ఆదుకోవాలని సూచించారు. వికసిత భారత్ 2047 లక్ష్యం చేరుకోవాలంటే రైతులను భాగస్వాములను చేయాల్సిందే మోదీ సంకల్పమని పేర్కొన్నారు. రైతు చిరునవ్వే శాస్త్రవేత్త విజయానికి గుర్తింపు అని అన్నారు. రైతు, వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రభుత్వం కలిసి పనిచేస్తేనే వ్యవసాయాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానానికి తీసుకెళ్లగలమన్నారు. కలిసికట్టుగా పనిచేద్దాం.. రైతును రారాజును చేద్దామని పిలుపునిచ్చారు.

అమిత్ షా తెలంగాణ పర్యటనపై మంత్రి పొన్నం విమర్శలు

మొదటిపేజీ తరువాయి

గతంలో తెలంగాణ అమరవీరుల పట్ల మోడీ, అమిత్ షా అవమానంగా మాట్లాడారన్నారు. తెలంగాణ అమరులకు క్షమాపణ చెప్పకుండా మీకు రాష్ట్రానికి వచ్చే హక్కు ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణపెట్టుబడులు

బీజేపీ ఉనికి కాపాడడానికి తెలంగాణలో అమిత్ షా మీటింగ్ పెడుతున్నారన్నారు. బీజేపీ మాదిరిగా కాకుండా తెలంగాణలో అమిత్ షా పర్యటనకు అన్ని రకాల అనుమతులు ఇస్తామని చెప్పారు. నవంబర్ 2న తెలంగాణలో అమిత్ షా పర్యటన ప్రధాని మోడీపై వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. పాదయాత్ర పేరుతో నడిచే కిలోమీటర్ కే ఏదో చేసినట్లు పెద్ద బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణపెట్టుబడులు

అమిత్ షా నిజంగా పాదయాత్ర చేయాలనుకుంటే హింస ప్రాంతలైన మణిపూర్ లాంటి ప్రాంతంలో తిరగాలని సవాల్ చేశారు. రాహుల్ గాంధీ పోరాటానికి అమిత్ షా మద్దతు తెలుపుతున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఓట్ చోర్ గద్ది చోడ్.. ఓట్ బచావో దేశ్ బచావో నినాదంతో నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ ర్యాలీ నిర్వహించనుందని తెలిపారు. అయితే, దీపావళి పేరుతో కాంగ్రెస్ ర్యాలీని వ్యాపారులతో అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

దీపావళి పండుగ నేపథ్యంలో కాంగ్రెస్ ర్యాలీ వద్దంటున్నారు.. మరీ నవంబర్ 2న అమిత్ షా హైదరాబాద్ కు ఎలా వస్తున్నారు. హైదరాబాద్ లో దీపావళి పండుగ లేదా.. ఇక్కడి వారు వ్యాపారులు కాదా అని ప్రశ్నించారు. బీజేపీ శిఖండి రాజకీయాలకు ఇదే నిదర్శనమని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీని వ్యతిరేకిస్తున్నారని.. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఓటమే ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ పతనం మొదలైందని హాట్ కామెంట్ చేశారు.

భూములు అమ్ముతాం.. బడులు బాగుచేస్తాం!

మొదటిపేజీ తరువాయి

గత మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. అటవీ పరిధిలో ఉన్న భూములను అటవీ శాఖకు, రెవెన్యూ పరిధిలో ఉన్న భూములను రెవెన్యూ శాఖకు అప్పగిస్తామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూములను ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగిస్తామని చెప్పారు.
అవసరమైన చోట భూములను విక్రయించి, ఆ నిధులను సంక్షేమ పథకాల అమలుకు వినియోగిస్తామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మియాపూర్ భూముల్లో ఇప్పటికే నిర్మాణాలు ఉన్నాయా లేదా అనే అంశంపై హెచ్ఎండీఏ అధికారులు సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

భూ కబ్జాలకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని.. ఇందులో బీఆర్ఎస్ నేతల బంధువులకు సంబంధించిన భూ ఆక్రమణలు బయటపడ్డాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో విచారణ జరగకుండా హరీశ్‌రావు అడ్డుకుంటున్నారని విమర్శించారు.
కేసీఆర్ ఫాంహౌస్ పరిసర ప్రాంతాల్లోనూ భూముల సర్వేలు నిర్వహిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. కేసీఆర్ ఫాంహౌస్ చుట్టుపక్కల ఉన్న రెండు గ్రామాల్లో సర్వేలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 388 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నామని, మరో 345 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామని పేర్కొన్నారు. మిగిలిన భూములను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా భూ ఆక్రమణలను మానుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో తమ ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు. ఎర్రవల్లి సమీపంలో తెలంగాణ అమరవీరుల కాలనీని నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి పేరుతో ఈ కాలనీని నిర్మించనున్నట్లు తెలిపారు.

జిరాక్స్ సెంటర్ ముసుగులో అక్రమ దందా.. పోలీసుల తనిఖీల్లో

మొదటిపేజీ తరువాయి

జల్పల్లి శ్రీరామ్ కాలనీకి చెందిన చింతల మహదేవ్ అనే వ్యక్తి బుద్వేల్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో 'కవిత ఏ టు జెడ్ ఆన్‌లైన్ సర్వీసెస్' పేరుతో జిరాక్స్ కేంద్రాన్ని నిర్వహిస్తూ ఈ మోసానికి పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఏడో తరగతి వరకు చదువుకున్న మహదేవ్, షాప్ ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు. ప్రత్యేక ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ల సాయంతో ఆధార్, పాన్ కార్డుల్లో పేర్లు, ఫొటోలు, పుట్టిన తేదీలు, చిరునామాలను అక్రమంగా మారుస్తూ దందాను ప్రారంభించాడు. జల్పల్లిలోని తన నివాసం నుంచే ఈ ముఠా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు విచారణలో తేలింది. కార్డుల్లో కేవలం పుట్టిన తేదీ మార్చడానికి రూ.300, పూర్తి వివరాలు మార్చడానికి రూ.700 నుండి రూ.1,000 వరకు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.
ఈ నకిలీ గుర్తింపు కార్డులను కొందరు ప్రైవేట్ ఫ్యాక్టరీల్లో ఉద్యోగాలు పొందేందుకు, మొబైల్ సిమ్ కార్డుల కొనుగోలుకు, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు ఉపయోగిస్తున్నట్లు విచారణలో బహిర్గతమైంది. నిందితుడి వద్ద నుంచి రూ.5,000 నగదు, 60 నకిలీ ఆధార్ కార్డులు, 2 పాన్ కార్డులు, ఒక ల్యాప్‌టాప్, ప్రింటర్, లామినేషన్ మెషిన్, ఒక మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తును పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆ భూములు అమ్ముతామంటే మేం ఒప్పుకోం'

మొదటిపేజీ తరువాయి

మియాపూర్ భూములు ప్రభుత్వానికి చెందినవే అంటూ కోర్టు తీర్పు వచ్చిన మరుక్షణమే, ఆ భూములను ఇప్పుడు ప్రభుత్వం అమ్ముతానంటోందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఆ భూములను అమ్మడానికి ఎట్టి పరిస్థితుల్లో తాము ఒప్పుకోమన్నారు రాంచందర్‌రావు. మియాపూర్ భూములను అమ్మడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.
'మియాపూర్ భూములు అమ్మడానికి బీజేపీ వ్యతిరేకిస్తుంది. సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి తీర్పు అనుకూలంగా వచ్చింది. ఇలా తీర్పు వచ్చిందో లేదో అలా అమ్ముతాం అంటూ సీఎం ప్రకటిస్తున్నారు. ఇది రియల్ ఎస్టేట్ ప్రభుత్వం. ఇంతకన్నా పెద్ద కష్ట కాలం వస్తే అప్పుడు ఏం అమ్ముతారు. భూములు అమ్మి ప్రభుత్వాన్ని నడపడం కరెక్ట్ కాదు. స్థానిక అభివృద్ధి, ఇతర అంశాలపై ఆలోచించకుండా డైరెక్ట్ అమ్ముతం అని చెపుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు రాంచందర్‌రావు.

మియాపూర్ భూములను పరిశీలించిన కలెక్టర్.. శరవేగంగా స్వాధీన ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి

400 ఎకరాలకు ఇప్పటికే ఫెన్సింగ్ ఉందని, మిగిలిన భూమికి ఫెన్సింగ్ వేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. 1995 నాటి ల్యాండ్ గ్రాబింగ్ కేసు నుంచి దాదాపు ముప్పై ఏళ్లుగా సాగుతున్న సుదీర్ఘ న్యాయ వివాదానికి సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పుతో శాశ్వతంగా తెరపడింది. సంపూర్ణంగా ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పరిశీలన, స్వాధీన పర్యవేక్షణ చేపట్టారు.

నవంబరు 14 వరకు.. సౌదీకి ఎయిరిండియా విమానాలు రద్దు

మొదటిపేజీ తరువాయి

నవంబర్ 14 వరకు వీటిని పొడిగిస్తున్నట్లు ప్రకటించాయి. జెడ్డా, రియాద్, దమ్మామ్ ఎయిర్‌పోర్టులకు రాకపోకలు సాగించే సర్వీసులపై ఈ ప్రభావం ఉంటుందని తెలిపాయి.
నవంబర్ 14 వరకు ప్రయాణాల కోసం టికెట్ బుకింగ్ చేసుకున్న ప్రయాణికులకు రీ-బుకింగ్ కోసం (నవంబర్ 29 వరకు ప్రయాణించేందుకు) ఒకసారి అవకాశం కల్పించనున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్నట్లయితే పూర్తి స్థాయి రీఫండ్ పొందవచ్చని తెలిపింది.
పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సౌదీలోని ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా ఇటీవల దాడులు పెరిగాయి. మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై దాడులు ఉండవచ్చని అమెరికా సంకేతాలు ఇస్తోంది. దీంతో ఎయిరిండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్ విమానయాన సంస్థలు సౌదీకి సర్వీసులను రద్దు చేశాయి. జెడ్డా, దమ్మామ్, మదీనాలకు నవంబర్ 14వరకు ఇండిగో సర్వీసులు రద్దు చేయగా.. ఆకాశ ఎయిర్ మాత్రం రియాద్‌కు నవంబర్ 30 వరకు, జెడ్డాకు నవంబర్ 10 వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

గీన్ ఎస్ఎం సంస్థను నిషేధించాలి: హైదరాబాద్ లో క్యాబ్, ఆటో డ్రైవర్ల ధర్నా

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో రవాణా రంగ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా ప్రైవేటు అంతర్జాతీయ సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమన్నారు.
రవాణా శాఖ, కార్మిక శాఖ అనుమతులు లేని సంస్థను తక్కువ ధరల పేరుతో రంగంలోకి తీసుకురావడం తగదన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న డ్రైవర్ల ఉపాధి మరింత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మాదాపూర్ సున్నం చెరువుకు జలకళ.. ప్రారంభానికి ముందు కరుణించిన వరుణ దేవుడు

హైదరాబాద్ మాదాపూర్ లోని సున్నం చెరువుకు జలకళ సంతరించుకుంది. 2026

అక్టోబర్ 30న (శుక్రవారం) సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చెరువుకు భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. మాదాపూర్ లో 7 సెం.మీ. వర్షపాతం నమోదు కావడంతో సున్నం చెరువులోకి భారీగా వరద నీరు చేరుతోంది.
చుట్టుపక్కల ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి సున్నం చెరువులోకి వరద నీరు భారీగా చేరుతున్నది. 7 సెంటీమీటర్ల వర్షంతో చెరువుకు జలకళ సంతకరించుకుంది. ఇన్‌లెట్ల ద్వారా చెరువులోకి వర్షపు నీరు చేరుతున్నది.
సున్నం చెరువును ఇటీవలే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది హైడ్రా.10 నుంచి 15 అడుగుల మేర పూడిక తొలగించి చెరువును పునరుద్ధరించింది . దుర్గంధం తొలగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు అధికారులు.
చెరువు చుట్టూ పాత్‌వే, పిల్లల ప్లే ఏరియాలు, గజీబోల నిర్మాణం ఏర్పాటు చేశారు. వర్షపు నీరు చెరువులోకి చేరుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి వస్తున్న నీటిని వీడియోలు తీసి హైడ్రా కమిషనర్‌కు పంపారు.
సున్నం చెరువును త్వరలో ప్రారంభించనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రారంభోత్సవానికి ముందే ఎల్ నినో ప్రభావం, ఎండలతో చెరువు అడుగంటిన పరిస్థితి. ఇవాళ కురిసిన వర్షంతో చెరువులో మళ్లీ జలకళ సంతరించుకుంది. చెరువులో నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అక్రమ బోర్ల తొలగింపుతో చెరువులో నీరు ఎక్కువకాలం నిలిచే అవకాశం ఉంది.

భారీ వర్షం.. హైదరాబాద్ లో నాలాలో పడిపోయిన డెలివరీ బాయ్

హైదరాబాద్ లో 2026 అక్టోబర్ 30 (శుక్రవారం) సాయంత్రం కురిసిన వర్షానికి నాలాలు, కాలువలు పొంగిపొర్లాయి. మాదాపూర్ ఏరియాలో ఉధృతంగా ప్రవహిస్తున్న నాలాలో డెలివరీ బాయ్ పడిపోయిన దృశ్యాలు తీవ్ర భయాందోళనకు గురిచేశాయి. సిటీగైడ్స్ చూడండి వివరాల్లోకి వెళ్తే.. జెప్టో (వజ్రశ్రీ) సంస్థలో డెలివరీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఘంటసాల అర్జున్ కుమార్ (46) తన బైక్‌పై వెళ్తుండగా మాదాపూర్ విటల్ రావు నగర్ దగ్గర జరిగింది ఈ ప్రమాదం. రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటి హోరుకు అదుపుతప్పి పక్కనే ఉన్న నాలాలో పడిపోయారు.
సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి అర్జున్ కుమార్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ప్రస్తుతం ఆయన క్షేమంగా ఉన్నారు.

చేపల ఉత్పత్తి నుంచి విలువ ఆధారిత వ్యాపారాల వైపు..

ప్రాసెసింగ్, మొబైల్ మార్కెటింగ్, ఆధునిక సాంకేతికతతో మత్స్యరంగానికి కొత్త ఊపు
2015 నుంచి రూ.39,272 కోట్ల పెట్టుబడులకు కేంద్రం కట్టుబాటు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
భారత మత్స్యరంగం చేపల ఉత్పత్తికే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతికత, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, డిజిటల్ మార్కెటింగ్‌తో విస్తరిస్తోంది. ఆహార, పోషక భద్రతను బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ఉపాధి, మత్స్యకారుల జీవనోపాధి, ఎగుమతి ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తోంది. చేపలను వినియోగదారులకు అనువైన ఉత్పత్తులుగా మార్చడం, శీతల సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం, సంచార విక్రయ వాహనాల ద్వారా మార్కెట్‌ను చేరువ చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
చేపలను శుద్ధి చేసి, ప్రాసెస్ చేసి, ప్యాకింగ్, బ్రాండింగ్‌తో వంటకు సిద్ధంగా లేదా నేరుగా తినేందుకు అనువైన రూపాల్లో అందించడం ద్వారా ఉత్పత్తిదారులకు మెరుగైన ధరలు లభించే అవకాశాలు పెరుగుతున్నాయి. చేపలు పట్టిన తర్వాత సంభవించే నష్టాలను తగ్గించడం, నిల్వ కాలాన్ని పెంచడం, నాణ్యతను మెరుగుపరచడంలో ఈ విధానం ఉపయోగపడుతోంది. ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, శీతల రవాణా, మార్కెటింగ్, చిల్లర విక్రయాల్లో మహిళలు, యువత, సహకార సంఘాలు, చిన్న వ్యాపారులకు కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి.

కృత్రిమ మేధ నుంచి డ్రోన్ల వరకు..
మత్స్యరంగ సంస్థలు కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చెయిన్, డ్రోన్లు, స్మార్ట్ శీతల సరఫరా వ్యవస్థలను వినియోగిస్తున్నాయి. సాంకేతిక ఆధారిత కచ్చితమైన మత్స్యసాగు పద్ధతులు కూడా విస్తరిస్తున్నాయి. ఉత్పత్తుల మూలాలను గుర్తించడం, ఉత్పాదకతను పెంచడం, నాణ్యతను నిర్ధారించడం, చేపల సేకరణ అనంతర నిర్వహణను మెరుగుపరచడంలో ఇవి దోహదపడుతున్నాయి. అంకుర సంస్థల ఆవిష్కరణలు మత్స్య ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయి.

మౌలిక వసతులకు భారీ ప్రోత్సాహం
మత్స్యరంగ అభివృద్ధికి 2015 నుంచి వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.39,272 కోట్ల పెట్టుబడులకు కట్టుబడింది. నీలి విప్లవ పథకం, మత్స్య--జలకృషి మౌలిక వసతుల అభివృద్ధి నిధి, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి కార్యక్రమాల ద్వారా ఈ రంగానికి మద్దతు అందిస్తోంది. దేశవ్యాప్తంగా 74.66 లక్షల మంది మత్స్యకారులు, చేపల పెంపకందారులకు ఉపాధి, జీవనోపాధి అవకాశాలను కల్పించడం ఈ చర్యల లక్ష్యం.
రవాణా, మార్కెటింగ్, అనుబంధ మౌలిక వసతుల కోసం రూ.3,393.85 కోట్ల పెట్టుబడితో 46,500 సదుపాయాలను సమకూర్చారు. వీటిలో చేపల రవాణా వ్యవస్థలు, చిల్లర--టోకు మార్కెట్లు, విక్రయ కేంద్రాలు, చేపల మేత తయారీ యూనిట్లు, ఐస్ ప్లాంట్లు, శీతల గిడ్డంగులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్లు ఉన్నాయి. అదనంగా ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థలు, పర్యావరణ అనుకూల పరిజ్ఞానం, రవాణా అనుసంధానంతో ఐదు స్మార్ట్ చేపల మార్కెట్లను అభివృద్ధి చేస్తున్నారు. వీటి ద్వారా 15,900 ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అంచనా.

నాణ్యమైన చేపల ఉత్పత్తికి జన్యు మెరుగుదల
విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి నాణ్యమైన చేపల నిరంతర సరఫరా అవసరమని మత్స్యశాఖ గుర్తించింది. వేగంగా పెరిగే, వ్యాధులను తట్టుకునే, అధిక ఉత్పాదకత కలిగిన రకాల అభివృద్ధికి జన్యు మెరుగుదల కార్యక్రమాలను చేపట్టింది. ట్రౌట్, రొయ్యలు, కట్లా, రోహు, తిలాపియా, పంగాసియస్, సీబాస్, స్కాంపి వంటి అధిక విలువ కలిగిన రకాల లభ్యతను పెంచేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి. దేశీయ వినియోగంతోపాటు ప్రాసెసింగ్, ఎగుమతి మార్కెట్ల అవసరాలను తీర్చడం ద్వారా పెంపకందారులకు మెరుగైన ఆదాయం లభించే అవకాశం ఉంది.

చిన్న ఉత్పత్తిదారులకు సంఘటిత బలం
చిన్న మత్స్యకారులు, చేపల పెంపకందారులు పెట్టుబడి, ఉత్పత్తి పరిమాణం, మార్కెట్ అనుసంధానంలో ఎదుర్కొనే సమస్యలను అధిగమించేందుకు సామూహిక వ్యాపార నమూనాలను ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా 2,195 మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటుకు మత్స్యశాఖ మద్దతు అందించింది. ఉత్పత్తులను సమీకరించడం, వనరులను పంచుకోవడం, ప్రాసెసింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌లో భాగస్వామ్యం పెంచుకోవడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి.
పలు సంస్థలను ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్---ఓఎన్‌డీసీతో అనుసంధానించారు. దీంతో డిజిటల్ మార్కెట్లను చేరుకోవడానికి, న్యాయమైన ధరలను పొందడానికి అవకాశాలు విస్తరిస్తున్నాయి. ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన కింద ఎన్‌సీడీసీ, నాఫెడ్, ఎస్‌ఎఫ్‌ఏసీ, నెరామాక్ వంటి సంస్థల సహకారంతో 5,500 మత్స్య సహకార సంఘాలను ఉత్పత్తిదారుల సంస్థలుగా పనిచేసేలా బలోపేతం చేస్తున్నారు.

మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు
మత్స్య ఉత్పత్తుల ప్రాసెసింగ్, చిన్నతరహా వ్యాపారాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద గత ఐదేళ్లలో 1.28 లక్షల మందికి పైగా మహిళా లబ్ధిదారుల ప్రయోజనం కోసం రూ.4,155 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో కేంద్ర వాటా రూ.1,572 కోట్లు.
చేపల ఎండబెట్టడం, చేపల పచ్చళ్లు, అప్పడాలు, పొగబెట్టి తయారు చేసే ఉత్పత్తులు, చేపల పొడి తయారీ, ప్యాకింగ్, చిల్లర విక్రయాలు వంటి కార్యకలాపాల్లో మహిళలకు ఈ సహాయం తోడ్పడుతోంది. సంచార చేపల విక్రయ వాహనాలు, సూక్ష్మ ప్రాసెసింగ్ యూనిట్లు తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లో మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. ప్రజలకు సరసమైన ధరలకు ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని చేరువ చేస్తున్నాయి.
చేపల ఉత్పత్తిని పెంచడంతోపాటు వాటిని నాణ్యంగా ప్రాసెస్ చేసి వినియోగదారులకు చేరవేసే బలమైన మార్కెట్ వ్యవస్థను నిర్మించడమే మత్స్యరంగ భవిష్యత్తుకు కీలకంగా మారుతోంది. మౌలిక వసతులు, సాంకేతికత, డిజిటల్ వేదికలు, మహిళా వ్యాపారాలను సమన్వయం చేయడం ద్వారా నష్టాలను తగ్గించి, ఎగుమతులను విస్తరించి, మత్స్యకారుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

అరుణాచల్‌ప్రదేశ్‌లో బుద్ధుని పవిత్ర అవశేషాల దర్శనం

అక్టోబర్ 31 నుంచి నవంబర్ 21 వరకు తవాంగ్, బోమ్‌డిలా, నామ్‌సాయిలో ప్రదర్శన
తవాంగ్ ప్రారంభోత్సవంలో పాల్గొననున్న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
బౌద్ధ భక్తులు, ప్రజలు శాక్యముని బుద్ధుని పవిత్ర అవశేషాలను దర్శించుకునేందుకు అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 21 వరకు తవాంగ్, బోమ్‌డిలా, నామ్‌సాయి ప్రాంతాల్లో ఈ పవిత్ర అవశేషాలను ప్రజల దర్శనార్థం ఉంచనున్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం, అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య, న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాయి.

Tawang Monastery


Bomdila Monastery

చారిత్రక గాడెన్ నామ్‌గ్యాల్ లాట్సే పేరుతో ప్రసిద్ధి చెందిన తవాంగ్ బౌద్ధారామంలో అక్టోబర్ 31న జరిగే ప్రారంభోత్సవంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, బౌద్ధ సంఘాల గురువులు, వివిధ బౌద్ధ సంస్థల ప్రతినిధులు, భక్తులు హాజరుకానున్నారు.

ప్రత్యేక వైమానిక విమానంలో తరలింపు
న్యూఢిల్లీ జాతీయ మ్యూజియంలో భద్రపరిచిన పిప్రాహ్వా పవిత్ర అవశేషాలకు అక్టోబర్ 30 రాత్రి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం వాటిని పాలం వైమానిక స్థావరానికి తరలిస్తారు. ప్రతిపాదిత ప్రయాణ ప్రణాళిక ప్రకారం అక్టోబర్ 31 తెల్లవారుజామున భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో గువాహటిలోని బోర్‌ఝార్ వైమానిక స్థావరానికి తీసుకెళ్లనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తవాంగ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
తవాంగ్‌లో పవిత్ర అవశేషాలకు మత సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికి, బౌద్ధారామంలో ప్రతిష్ఠించనున్నారు. అక్టోబర్ 31 ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల మధ్య ప్రతిష్ఠాపన, ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు.
నవంబర్ 1న అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ముఖ్య అతిథిగా మరో ప్రారంభ కార్యక్రమం జరగనుంది. అనుబంధ ప్రదర్శనను కూడా ఈ సందర్భంగా ప్రారంభించనున్నారు.

బౌద్ధ సంప్రదాయాలకు ప్రతీకగా కార్యక్రమం
బుద్ధుడు దివ్యలోకం నుంచి భూమికి తిరిగి వచ్చిన సందర్భాన్ని స్మరించుకునే టిబెటన్ బౌద్ధ సంప్రదాయంలోని ముఖ్య పర్వదినం 'ల్హాబాబ్ దుచెన్'తో ఈ కార్యక్రమం ముడిపడి ఉంది. దీంతో భక్తి, సాంస్కృతిక వారసత్వం, ప్రజల భాగస్వామ్యం సమ్మిళితమయ్యే ఆధ్యాత్మిక వేడుకగా ఇది నిలవనుంది.
మూడు ప్రాంతాల్లోనూ పిప్రాహ్వా వారసత్వ సంపద వెలికితీత, తిరిగి స్వదేశానికి తీసుకురావడానికి సంబంధించిన విశేషాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. 'హిమాలయ ప్రాంతం, ఇతర ప్రాంతాల్లో బౌద్ధ వ్యాప్తి' అంశంపై అంతర్జాతీయ సదస్సు కూడా నిర్వహించనున్నారు. భారత్‌తోపాటు మరో ఆరు దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, పండితులు, ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు.
పవిత్ర అవశేషాల పవిత్రత, భద్రత, పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ రవాణా, ప్రతిష్ఠాపన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్ర సాంస్కృతిక శాఖ.. రక్షణ శాఖ, భారత వైమానిక దళం, అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం, జాతీయ మ్యూజియం, ఇతర సంబంధిత సంస్థలతో సమన్వయం చేస్తోంది. భారత బౌద్ధ వారసత్వ పరిరక్షణతోపాటు దేశవిదేశాల్లోని బౌద్ధ సమాజాలతో సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ లక్ష్యమని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల ఆధునీకరణకు రూ.2.50 కోట్ల సింగరేణి సీఎస్ఆర్ నిధులు

యువతలో క్రమశిక్షణ, నిస్వార్థ సేవ, నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాలి
అన్ని ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల విస్తరణ: మంత్రి అడ్లూరి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,
అక్టోబర్ 30: విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. నిజమైన స్కౌట్ అండ్ గైడ్ అంటే యూనిఫామ్ ధరించడం మాత్రమే కాదని, నిస్వార్థ సేవ, ధైర్యం, కరుణ వంటి విలువలను జీవితంలో ఆచరించడమేనని పేర్కొన్నారు. హైదరాబాద్ దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యాలయంలో ఉన్న మోడల్ హైస్కూల్ ఆధునీకరణ, పునరుద్ధరణ పనులకు శుక్రవారం గవర్నర్ శంకుస్థాపన చేశారు. ఈ పనుల కోసం సింగరేణి సంస్థ రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులను మంజూరు చేసింది. అదేవిధంగా ఐదు ఎకరాల ప్రాంగణంలో జీహెచ్ఎంసీ చేపట్టిన సుందరీకరణ పనులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్య, యువత సాధికారత, వ్యక్తిత్వ నిర్మాణమే బలమైన దేశ నిర్మాణానికి పునాదులని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను కేవలం మార్కులతో కాకుండా నైతిక విలువలు, సమాజ సేవ పట్ల నిబద్ధతతో అంచనా వేయాలని సూచించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, విపత్తుల సహాయక చర్యలు, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ వ్యక్తిత్వ నిర్మాణం, నిస్వార్థ సేవే నిజమైన నాయకత్వానికి పునాదులని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా క్రమశిక్షణ, నైతిక విలువలు, పౌర బాధ్యతలకు ప్రాధాన్యత తగ్గకూడదన్నారు. రాష్ట్రంలో 3,200 పాఠశాలల్లో 1.30 లక్షల మంది విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో స్కౌటింగ్, గైడింగ్ కార్యక్రమాలను విస్తరించాలని అధికారులకు సూచించారు. దీనివల్ల వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాయకత్వం, వ్యక్తిత్వ వికాసం, సమాజ సేవలో సమాన అవకాశాలు లభిస్తాయని అన్నారు.
కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిషనర్ దానకిశోర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, రాష్ట్ర కార్యదర్శి నవీన్ నికోలస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, సింగరేణి, స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు పాల్గొన్నారు.

అసంఘటిత, గిగ్ కార్మికుల సామాజిక భద్రతకు కీలక అడుగు

జాతీయ సామాజిక భద్రతా బోర్డుల ఏర్పాటుకు కేంద్రం నోటిఫికేషన్
సంక్షేమ పథకాల సిఫార్సు, అమలు పర్యవేక్షణ బాధ్యతలు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
దేశంలోని అసంఘటిత రంగ కార్మికులతోపాటు గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సమగ్ర సామాజిక భద్రత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. సామాజిక భద్రతా కోడ్ పరిధిలో జాతీయ సామాజిక భద్రతా బోర్డులను ఏర్పాటు చేస్తూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. డిజిటల్ వేదికల ద్వారా పనిచేసే గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను వ్యవస్థీకృత సంక్షేమ పరిధిలోకి తీసుకురావడంలో ఈ చర్య ప్రాధాన్యం సంతరించుకుంది.
కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి అధ్యక్షతన ఈ బోర్డులు పనిచేయనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, ప్రముఖ అగ్రిగేటర్ కంపెనీలు, యాజమాన్యాలు, పౌర సమాజ సంస్థలు, కార్మిక సంఘాలు, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంఘాల ప్రతినిధులు ఇందులో భాగస్వాములుగా ఉంటారు.
అసంఘటిత రంగంలోని వివిధ వర్గాల కార్మికులు, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాల రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయడం బోర్డుల ప్రధాన బాధ్యత. ఆయా వర్గాలకు సామాజిక భద్రత అందించడంలో ఉన్న అంతరాలను తగ్గించే లక్ష్యంతో ఇవి పనిచేయనున్నాయి.

పథకాల అమలు నుంచి నిధుల వ్యయం వరకు సమీక్ష
కేంద్ర ప్రభుత్వం అమలు చేసే అసంఘటిత, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సామాజిక సంక్షేమ పథకాలను బోర్డులు పర్యవేక్షించనున్నాయి. సామాజిక భద్రతా కోడ్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తమ పరిశీలనకు పంపే అంశాలపై సలహాలు అందిస్తాయి.
రాష్ట్ర స్థాయిలో రికార్డుల నిర్వహణను సమీక్షించడంతోపాటు సంబంధిత నిధులు, ఖాతాల నుంచి జరిగే వ్యయాన్ని పరిశీలిస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్పగించే ఇతర విధులను కూడా నిర్వర్తించనున్నాయి.
జాతీయ సామాజిక భద్రతా బోర్డులు ఏడాదికి కనీసం మూడుసార్లు సమావేశం కావాల్సి ఉంటుంది. సమావేశాల నిర్వహణ, కార్యకలాపాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలను అనుసరిస్తాయి.
సంప్రదాయ అసంఘటిత రంగ కార్మికులతోపాటు డిజిటల్ ఆధారిత ఉపాధిలో ఉన్న కార్మికులకూ సంక్షేమ వ్యవస్థలో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక భద్రతను విస్తరించేందుకు ఈ బోర్డులు దోహదపడనున్నాయని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పేర్కొంది.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్
హాలియా: నవంబర్ 1, 2 తేదీల్లో కట్టంగూరులో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభలకు సంబంధించిన గోడపత్రికను మండల విద్యాధికారి రమావత్ రామచంద్రయ్య ఆవిష్కరించారు. అనంతరం పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలు వంటి కీలక అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతన స్కేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందని పేర్కొంటూ, జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సుకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దాస వెంకన్న, ఎస్. నాగిరెడ్డి, జిల్లా కార్యదర్శి రమాదేవి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి రవీందర్, ఎస్కే సయ్యద్ మియా, ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, సునీత, కోశాధికారి ఏలేటి నాగరాజు, సీనియర్ నాయకులు వెంకటరామిరెడ్డి, వీరాసింగ్, చంద్రయ్య, షాబుద్దీన్, సైదులు, రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థి పీజీ అడ్మిషన్ సమస్య పై అండగా నిలిచిన మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎం.ఎస్. ఎఫ్) నాయకత్వం

యాదాద్రి భువనగిరి, అక్టోబరు30/ట్రైనెట్ న్యూస్:
ఉస్మానియా యూనివర్సిటీలో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మాదిగ విద్యార్థి పీజీ అడ్మిషన్ సమస్యపై ఉస్మానియా యూనివర్సిటి డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ పాండురంగ రెడ్డిని ఎమ్మార్పియస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో విద్యార్థి సమస్యలపై ఉద్యమస్తున్న నాయకత్వం మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎం ఎస్ ఎఫ్) మాజీ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ,ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,ఆత్మకూరు(ఎం) మండల మాజీ అధ్యక్షులు మందుల లింగ స్వామి మాదిగ,పీజీ విద్యార్థిని మందుల శివాణి తదితరులు కలవడం జరిగింది.విద్యార్థి అడ్మిషన్ సమస్య క్లియర్ అవ్వడం జరిగింది.

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ: సమ్మిళిత అభివృద్ధి, సుస్థిరత, ప్రజాకేంద్రిత పాలనతోనే లక్ష్య సాధన

ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్య ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పుగా ప్రతిబింబించాలి: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
పర్యావరణ పరిరక్షణ, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి, ప్రజల అవసరాలకు అనుగుణమైన విధానాల రూపకల్పనకు పిలుపు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన ప్రతిభ, పారిశ్రామిక సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్రానికి పుష్కలంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అలాగే ఆర్థిక వృద్ధి కేవలం స్థూల ఆర్థిక గణాంకాలు, తలసరి ఆదాయ పెరుగుదలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లో స్పష్టమైన మార్పును తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ.) స్వర్ణోత్సవాల సందర్భంగా తుంగభద్ర బ్లాక్, శ్రవణ్ కుమార్ హాల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి , ప్రజా విధానాలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ. ప్రచురించే సమృద్ధి జర్నల్ ప్రత్యేక సంచికను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

ఆర్థిక వృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలి

తెలంగాణలో ఐటీ, లైఫ్ సైన్సెస్, కీలక సేవారంగాల్లో హైదరాబాద్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావిస్తూ, రాష్ట్రానికి ఉన్న పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలను సమర్థంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే వాస్తవ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక సూచీలు పెరగడం మాత్రమే కాదని, యువతకు భద్రమైన ఉపాధి అవకాశాలు, ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు, వ్యవసాయ రంగానికి ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలని అన్నారు.

హైదరాబాద్‌లో కేంద్రీకృతమవుతున్న ఆర్థిక ప్రగతి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఫ్రైట్ కారిడార్లు, ప్రత్యక్ష మార్కెట్ అనుసంధానాలు, జిల్లాల వారీగా పారిశ్రామిక అవకాశాల కల్పన ద్వారా పట్టణ, పల్లె ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించాలని సూచించారు. యువత వ్యవసాయ సంక్షోభం కారణంగా కాకుండా మెరుగైన అవకాశాలు, ఉన్నత ఆశయాల కోసం తమ ప్రాంతాలను విడిచి వెళ్లే పరిస్థితులు కల్పించడమే సమతుల్య అభివృద్ధి లక్ష్యమని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిర అభివృద్ధి

సుస్థిర అభివృద్ధి ఆవశ్యకతను వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణను విస్మరించి చేపట్టే అనాలోచిత పట్టణ విస్తరణ భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఉప ముఖ్యమంత్రి హెచ్చరించారు. చెరువులు, సహజ నీటి వనరులు కనుమరుగయ్యేలా చేసే అశాస్త్రీయ అభివృద్ధి కారణంగా భవిష్యత్తులో వరద నివారణ, సహాయక చర్యల కోసం ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని, ప్రస్తుత నిర్ణయాల భారాన్ని రాబోయే తరాలపై మోపకూడదని అన్నారు. మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక పట్టణాభివృద్ధి కార్యక్రమాలు పర్యావరణ సమతుల్యత, ప్రజారోగ్య పరిరక్షణ, ప్రభావిత కుటుంబాలకు గౌరవప్రదమైన మరియు నాణ్యమైన పునరావాసం అనే అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

సుస్థిరత అనేది పర్యావరణ బాధ్యత మాత్రమే కాకుండా ఆర్థిక క్రమశిక్షణకు కూడా సంబంధించిన అంశమని పేర్కొంటూ, బాధ్యతాయుతమైన బడ్జెట్ నిర్వహణ, స్వచ్ఛ ఇంధన వినియోగం, మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం, వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే సంస్థాగత వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న అనిశ్చితి, మార్పుల భారాన్ని రైతులు ఒంటరిగా భరించాల్సిన పరిస్థితి రాకుండా తగిన రక్షణ వ్యవస్థలు కల్పించాలని సూచించారు. ఒక ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం ఒక్కసారే జరిగినప్పటికీ, దాని నిర్వహణ బాధ్యత ప్రతిరోజూ కొనసాగుతుందని పేర్కొంటూ, దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఉద్ఘాటించారు.

ప్రజల అవసరాలే ప్రజా విధానాలకు ప్రాతిపదిక కావాలి

ప్రజా విధానాలు, పరిపాలనా సంస్కరణలపై మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల మధ్య ఉన్న విభాగపరమైన గోడలను తొలగించి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. వ్యవసాయం, విద్యుత్, సాగునీటి శాఖల విధానాలు విడివిడిగా కాకుండా రైతు జీవితాన్ని సమగ్రంగా దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని అన్నారు. ప్రజలకు అందించే సేవల్లో వారి సమయాన్ని కూడా పరిపాలనా సామర్థ్యాన్ని కొలిచే ముఖ్యమైన ప్రమాణంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. ఒక రోజువారీ కూలీ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ పదేపదే తిరగాల్సి రావడం వల్ల అతను కోల్పోయే ఆదాయం గుర్తించబడని ఆర్థిక నష్టమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనా సంస్కరణలు ప్రజలకు సేవలను మరింత సులభతరం చేయాలే తప్ప అదనపు ఇబ్బందులకు కారణం కాకూడదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న హక్కుల ఆధారిత సంక్షేమ విధానాలను ప్రస్తావిస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్న గృహజ్యోతి పథకం, 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అంతర్జాతీయ ప్రమాణాలతో 108 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, 14 వేల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పడకల విస్తరణ వంటి కార్యక్రమాలను వివరించారు.

సామాజిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలను తక్కువ ప్రాధాన్యత కలిగిన బాధ్యతలుగా కాకుండా సమాజంలో శాశ్వతమైన మార్పు తీసుకురాగల కీలక పరిపాలనా రంగాలుగా అధికారులు భావించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రంగాల్లో పనిచేసే అధికారులకు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకువచ్చే గొప్ప అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా దాదాపు 12 రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, విధాన నిపుణులు, అధ్యాపకులు పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, కేరళ, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది పరిశోధనా పత్రాల సమర్పకులు పాల్గొంటున్నారు.

ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ. డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, అదనపు డైరెక్టర్ జనరల్ అనితా రామచంద్రన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ఇతర ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు దీపావళి కానుక.. నవంబర్ 5న బోనస్ జమ

ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చెల్లింపు
38 వేల మంది కార్మికులకు రూ.419 కోట్ల బోనస్
దసరా, దీపావళి బోనస్‌లతో నెల రోజుల్లోనే ఒక్కొక్కరికి సగటున రూ.2.65 లక్షల లబ్ధి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. ఇప్పటికే దసరా సందర్భంగా లాభాల వాటా బోనస్ అందుకున్న కార్మికులకు తాజాగా దీపావళి బోనస్ ప్రకటించింది. నవంబర్ 5వ తేదీన పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్ (దీపావళి బోనస్) కింద సుమారు రూ.419 కోట్లను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చెల్లించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ నవంబర్ 5న బోనస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంస్థ యాజమాన్యాన్ని ఆదేశించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి, విస్తరణకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఇప్పటికే ఈ నెలలో లాభాల వాటా కింద దాదాపు రూ.600 కోట్లు చెల్లించామని, తాజాగా మరో రూ.419 కోట్ల దీపావళి బోనస్ అందించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. బొగ్గు రంగంలో పెరుగుతున్న పోటీని అధిగమించేందుకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే దిశగా సింగరేణి యాజమాన్యం ప్రయత్నించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత పర్సనల్, ఫైనాన్స్ విభాగాల అధికారులతో సమావేశమై నవంబర్ 5న బోనస్ చెల్లింపునకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ బోనస్ ద్వారా సుమారు 38 వేల మంది కార్మికులకు ప్రయోజనం కలగనుంది.

అయితే దీపావళి బోనస్ కేవలం ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. అధికారులకు ఈ బోనస్ వర్తించదు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్‌కాస్ట్, సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తి బోనస్ అందుతుంది. అంతకంటే తక్కువ రోజులు పనిచేసిన వారికి వారు విధులు నిర్వహించిన రోజులకు అనుగుణంగా నిష్పత్తి ప్రకారం బోనస్ చెల్లిస్తారు. ఈ బోనస్ పొందేందుకు గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసి ఉండటం తప్పనిసరి అర్హతగా నిర్ణయించారు. సింగరేణి కార్మికులకు నెల రోజుల వ్యవధిలోనే దసరా, దీపావళి బోనస్‌ల రూపంలో సగటున దాదాపు రూ.2.65 లక్షలు అందనున్నాయి. ఈ రెండు బోనస్‌ల కింద కలిపి ఒక్కో కార్మికుడికి సుమారు రూ.1,020 కోట్ల మేర చెల్లింపులు జరుగుతున్నట్లు సంస్థ వెల్లడించింది.

మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు.. రూ.50 వేల కోట్ల భూములకు రక్షణ: సీఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల భూ ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకున్నాం.. మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను కాపాడాం
మియాపూర్ భూముల విక్రయంతో వచ్చే నిధులను విద్య, వైద్యం, సాగునీటి రంగాల అభివృద్ధికి వినియోగిస్తాం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: మియాపూర్‌లో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ తీర్పు ప్రభుత్వ భూముల పరిరక్షణకు కీలక విజయమని పేర్కొంటూ సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మియాపూర్ భూముల వ్యవహారంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన బంధువు దామోదర్ రావు, గోల్డ్ స్టోన్ ప్రసాద్ ద్వారా మియాపూర్ భూములను కొల్లగొట్టేందుకు ప్రయత్నించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంలో దామోదర్ రావుకు ముందుగానే విలాసవంతమైన కార్లను లంచంగా ఇచ్చారని, కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని విలువైన భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో భూ ఆక్రమణలపై పోరాడినందుకే తనపై కక్ష కట్టి జైలుకు పంపించారని సీఎం ఆరోపించారు. మియాపూర్ భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించామని, తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

భూముల విక్రయంతో అభివృద్ధి పనులు

మియాపూర్ భూములను విక్రయించడం ద్వారా వచ్చే నిధులను నీటిపారుదల, విద్య, వైద్యం తదితర కీలక రంగాల అభివృద్ధికి వినియోగిస్తామని సీఎం ప్రకటించారు. ఈ అంశాన్ని మంత్రివర్గంలో చర్చిస్తామని చెప్పారు. వనరుల సమీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయం, తద్వారా సమకూరే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యయనం చేస్తుందని వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించామని రేవంత్ రెడ్డి తెలిపారు.

పలు ప్రాంతాల్లో భూ ఆక్రమణలను అడ్డుకున్నాం

ఐఎంజీ భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై కేటీఆర్ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని, న్యాయపోరాటం ద్వారా వాటిని అడ్డుకున్నామని సీఎం ఆరోపించారు. కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూముల విషయంలోనూ బీఆర్ఎస్ నాయకుల ప్రయత్నాలను న్యాయపోరాటంతో అడ్డుకున్నట్లు చెప్పారు.

గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు ఆక్రమించేందుకు ప్రయత్నించగా సుప్రీంకోర్టులో పోరాడామని, అవి అటవీ భూములేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆ భూములను కాపాడటమే కాకుండా పోలీసుల పిల్లల కోసం అక్కడ పాఠశాలను ఏర్పాటు చేశామని చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగించారని, సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేసి ఆ భూములను రక్షించామని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బీఆర్ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నట్లు వివరించారు. హరీశ్ రావు మామ హనుమంతరావు ఆక్రమించిన భూముల సర్వేకు అధికారులు ప్రయత్నిస్తుంటే వారిని అడ్డుకుంటున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణల అంశంపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. శాసనసభలో ఈ అంశంపై చర్చించి చర్యలు తీసుకోవాలని ప్రయత్నిస్తే బీఆర్ఎస్ నాయకులు స్పందించడం లేదన్నారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ ఆ పార్టీ నాయకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కనీసం రెవెన్యూ అధికారులను కూడా ఎందుకు అభినందించడం లేదని నిలదీశారు. పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై ఉమ్మడి రాష్ట్రంలో కేసులు వేసిన కేసీఆర్, హరీశ్ రావులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎవరిపై కేసులు వేశారో వారితోనే లాలూచీ పడ్డారని ఆరోపించారు. మియాపూర్ భూముల విషయంలో ఇప్పటికైనా కుట్రలు మానుకోవాలని కేసీఆర్, కేటీఆర్‌లకు సూచించారు. భూ ఆక్రమణలపై చర్చించేందుకు బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు.

ఆక్రమణలను తొలగించి అమరవీరుల కాలనీ నిర్మాణం

రెండు గ్రామాల మధ్య ఉన్న వివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా మలచుకున్నారని సీఎం ఆరోపించారు. అక్కడి భూ ఆక్రమణలపై సమగ్రంగా తేల్చి, శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తామని ప్రకటించారు. కేసీఆర్, కేటీఆర్ ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకుని భూ ఆక్రమణలకు పాల్పడటం మానుకోవాలని రేవంత్ రెడ్డి హితవు పలికారు. భూముల ఆక్రమణలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలు తీర్పులు ఇస్తున్నాయని, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు తమ ప్రభుత్వం నిరంతరం న్యాయపోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నేతల భూభాగోతాలు కోకొల్లలు: మంత్రి పొంగులేటి

మియాపూర్ భూముల వెనుక కుట్రలు సుప్రీంకోర్టు తీర్పుతో బట్టబయలులిలి
560 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది
హరీశ్ రావు, కేటీఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:

బీఆర్ఎస్ నేతల భూభాగోతాలు కోకొల్లలుగా ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుట్రలు బట్టబయలయ్యాయని అన్నారు. ప్రభుత్వ భూములను కాజేయడానికే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దగాకోరు ధరణి విధానాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు.

మియాపూర్‌లో సుమారు రూ.30 వేల కోట్లకు పైగా విలువ చేసే 560 ఎకరాల భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించిందని పొంగులేటి ఆరోపించారు. నమస్తే తెలంగాణ పత్రిక ఎండీ దామోదర్ రావుకు ఎస్ క్లాస్ బెంజ్ కారును బహుమతిగా ఇచ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఈ భూములను అప్పగించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందని విమర్శించారు.

రేవంత్ రెడ్డి పోరాటంతో భూములకు రక్షణ

ఈ భూముల వ్యవహారాన్ని అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెలుగులోకి తీసుకొచ్చారని మంత్రి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మియాపూర్ భూముల పరిరక్షణ కోసం అనుభవజ్ఞులైన న్యాయవాదులతో సుప్రీంకోర్టులో బలమైన న్యాయపోరాటం చేయించారని తెలిపారు.

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తాజాగా ఆ భూములు ప్రభుత్వానివేనని తీర్పు వెలువరించడం ప్రజా ప్రభుత్వానికి గొప్ప విజయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల భూ ఆక్రమణల ప్రయత్నాలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలు తీర్పులు ఇస్తున్నాయని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్ తమ వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ భూములను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లనివ్వబోమని మంత్రి స్పష్టం చేశారు.

తుఫాన్ బాధితుల కష్టం తెలుసు..ఆదుకుంటాం

సాధారణ స్థితికి తెచ్చేందుకే నిరంతరం శ్రమిస్తున్నాం
పంటల భీమాతోనే ప్రతిరైతుకూ ధీమా
డెల్టా కాలువల ఆధునీకరణతో ముంపు తొలగిస్తాం
తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
షెల్టర్లలోని బాధితులకు బియ్యం, సరుకులు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి

నరసాపురం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: అర్నబ్ తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులు, నష్టాలకు గురైన కొబ్బరి రైతులు, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలో భాగంగా రెండో రోజు పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించి, రైతులు, మత్స్యకారులు, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టం జరిగినప్పుడు బీమా ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రైతులు కష్టపడి పండించిన పంటకు నష్టం వాటిల్లకుండా చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంట కాలువల్లో నీటి ప్రవాహం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపాలని సూచించారు. దీనివల్ల పంటలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

15 వేల విద్యుత్ స్తంభాలు నేల కూలాయిలి

తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేల కూలాయని సీఎం తెలిపారు. రేపు సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని ప్రకటించారు. తొలుత గృహాలకు, ఆ తర్వాత వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. అవసరమైన అదనపు సిబ్బందిని తెలంగాణ నుంచి కూడా రప్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి.. కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సీఎం సహకరించారు. విపత్కర పరిస్థితుల్లో నూ శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బంది, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు నేల కూలాయని, వాటి వ్యర్థాలను త్వరితగతిన తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తుఫాను గాలుల కారణంగా కొబ్బరి చెట్లు, వరి పంటలు దెబ్బతిన్నాయని, బాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలోనూ కొంత అంతరాయం ఏర్పడిందని, ప్రైవేటు టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిగ్నల్స్ సమస్య తలెత్తిందని తెలిపారు. వీటిని కూడా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

తుఫాను షెల్టర్లలో బాధితులకు భరోసా

మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. నాలుగు రోజులుగా అక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళలు, ఇతర బాధితులతో మాట్లాడారు. తుఫాను తీరం దాటే సమయంలో తీవ్ర ఆందోళనకు గురయ్యామని వారు సీఎంకు వివరించారు. తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని, అందువల్ల ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని సీఎం తెలిపారు. వశిష్ట గోదావరిలో ఎదురవుతున్న సమస్యలను మత్స్యకారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సముద్ర ముఖద్వారం వద్ద కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా చేపల వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

కేంద్ర బృందం కూడా పర్యటిస్తుంది

మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్ సందర్శన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. అర్నబ్ తుఫాను ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించానన్నారు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ముందస్తు చర్యలు తీసుకుందని చెప్పారు. రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ వాతావరణ పరిస్థితులను అంచనా వేసి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశామని వివరించారు. కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేశామని తెలిపారు. గతంతో పోలిస్తే ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగామని, దురదృష్టవశాత్తూ ఏడుగురు మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామన్నారు. తుఫాను వల్ల ప్రాథమికంగా రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి కేంద్రానికి నివేదిక పంపించామని, పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక అందిస్తామని తెలిపారు. నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని, ప్రజల భాగస్వామ్యంతో విపత్తును సమర్థంగా ఎదుర్కొన గలిగామని సీఎం అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువులను నింపేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

పీఎం కిసాన్--అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదికి మూడు విడతల్లో మొత్తం రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీలో భాగంగా రెండో విడతగా రూ.7 వేల చొప్పున రైతులకు జమ చేశామన్నారు. తుఫాను కారణంగా పంటలు నీట మునిగిన రైతులను కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుఫాను బాధిత కుటుంబాలకు బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. సహాయ కార్యక్రమాల్లో భాగంగా బాధితులందరికీ ప్రభుత్వం ప్రకటించిన రేషన్ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నప్పటికీ తుఫాను బాధితుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. మీడియా సమావేశం అనంతరం ముఖ్యమంత్రి తుఫాను బాధితులకు స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

ఢిల్లీలో ఐకార్--సీజీఐఏఆర్ సైన్స్ అండ్ పార్టనర్‌షిప్ వీక్--2027

ఏప్రిల్ 12 నుంచి 17 వరకు నిర్వహణ.. 5 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం
భారత వ్యవసాయ విజయాలు, అంతర్జాతీయ పరిశోధన భాగస్వామ్యాలకు వేదిక

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, రైతులకు చేరువయ్యే ఆవిష్కరణలకు దేశ రాజధాని న్యూఢిల్లీ వేదిక కానుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 12 నుంచి 17 వరకు 'ఐకార్--సీజీఐఏఆర్ సైన్స్ అండ్ పార్టనర్‌షిప్ వీక్--2027'ను నిర్వహించనున్నట్లు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్), అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన భాగస్వామ్య సంస్థ సీజీఐఏఆర్ శుక్రవారం ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా 5 వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది.

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగానికి చెందిన ఐకార్, సీజీఐఏఆర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. పరిశోధకులు, రైతులు, ప్రభుత్వ ప్రతినిధులు, అంకుర సంస్థలు, వ్యాపార సంస్థలు పాల్గొని వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆవిష్కరణలు, వాటిని మరింత మంది రైతులకు చేరవేసే మార్గాలపై చర్చించనున్నారు.

ఐదు దశాబ్దాల పరిశోధన బంధం

భారత్--సీజీఐఏఆర్ భాగస్వామ్యం ఐదు దశాబ్దాలకు పైగా దేశ వ్యవసాయ పరిశోధన, అభివృద్ధికి కీలకంగా తోడ్పడుతోందని వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగం కార్యదర్శి, ఐకార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్ తెలిపారు. వందకు పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 15 పరిశోధన కేంద్రాలతో కూడిన సీజీఐఏఆర్‌తో సహకారం ద్వారా పంటల అభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన పురోగతి సాధించినట్లు వివరించారు.

హరిత విప్లవం నుంచి భారత వ్యవసాయ రంగం సాధించిన పరివర్తనలో సిమిట్, ఇరి, ఇక్రిశాట్ వంటి అంతర్జాతీయ పరిశోధన సంస్థల సహకారం ముఖ్యపాత్ర పోషించిందన్నారు. ఒకప్పుడు ఆహార దిగుమతులపై ఆధారపడిన భారత్.. నేడు ప్రధాన ఆహార ఉత్పత్తి, ఎగుమతి దేశంగా ఎదిగిందని పేర్కొన్నారు. జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా భారత్‌లో ఐకార్, సీజీఐఏఆర్ పరిశోధన కార్యకలాపాలను మరింత సమన్వయం చేయనున్నట్లు తెలిపారు.

గ్లోబల్ సౌత్‌కు భారత ఆవిష్కరణలు

అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య దక్షిణ--దక్షిణ సహకారాన్ని ప్రోత్సహించడం, ముఖ్యంగా ఆఫ్రికా దేశాలతో విజయవంతమైన భారత వ్యవసాయ ఆవిష్కరణలను పంచుకోవడం తమ ప్రాధాన్యమని డాక్టర్ జాట్ వెల్లడించారు. వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయం, అగ్రిస్టాక్, వ్యవసాయ యాంత్రీకరణ, చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం, సుస్థిర సాగు విధానాల్లో అంతర్జాతీయ సహకారానికి విస్తృత అవకాశాలున్నాయన్నారు.

ఈ సదస్సులో నీటి నిర్వహణ, నేల ఆరోగ్యం, ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యాలు, అంకుర సంస్థలు, యువత, మహిళల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. వ్యవసాయ శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణలను రైతులకు చేరవేయడంలో మీడియా పాత్రను కూడా పరిశీలించనున్నారు.

ఆసియా, ఆఫ్రికా రైతులకు భారత పరిశోధనల ప్రయోజనం

ప్రపంచంలోని అతిపెద్ద జాతీయ వ్యవసాయ పరిశోధన వ్యవస్థల్లో ఐకార్ ఒకటిగా నిలుస్తోంది. ప్రస్తుతం భారత్‌లో సీజీఐఏఆర్‌కు చెందిన పది పరిశోధన కేంద్రాలు పంటలు, నీరు, పశుసంపద, మత్స్యరంగం, పోషకాహారం, విధానాలపై పనిచేస్తున్నాయి.

భారత్‌కు చెందిన వేరుశనగ జన్యు నమూనాను ఇక్రిశాట్ సంరక్షించి, ఇతర దేశాలకు అందించడం ద్వారా మలావి, ఉగాండా, మొజాంబిక్, జాంబియాలో సాగవుతున్న రకాల అభివృద్ధికి తోడ్పడింది. హైదరాబాద్‌లోని వ్యవసాయ దక్షిణ--దక్షిణ సహకార ఉత్కృష్టత కేంద్రం సైతం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు నిరూపిత వ్యవసాయ ఆవిష్కరణలను చేరవేస్తోంది.

రానున్న 50 ఏళ్ల సహకారానికి దిశానిర్దేశం

భారత్--సీజీఐఏఆర్ దీర్ఘకాల భాగస్వామ్య విజయాలను చాటడంతోపాటు రానున్న 50 ఏళ్ల వ్యవసాయ సహకారానికి దిశానిర్దేశం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని సీజీఐఏఆర్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఇస్మహానే ఎలౌఫీ తెలిపారు. బలమైన జాతీయ శాస్త్ర పరిశోధన వ్యవస్థతో విస్తృత స్థాయిలో ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో భారత్ నిరూపించిందన్నారు. భారత్ నుంచి అందుతున్న విత్తనాలు, పరిజ్ఞానం ఇప్పటికే ఆఫ్రికా, ఆసియా రైతులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

మానవ సంక్షేమాన్ని మెరుగుపరచడంలో, ఆహార వ్యవస్థలను బలోపేతం చేయడంలో శాస్త్రవేత్తల కృషికి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరముందన్నారు. 2025 ఏప్రిల్‌లో కెన్యా రాజధాని నైరోబీలో నిర్వహించిన తొలి సీజీఐఏఆర్ సైన్స్ వీక్ విజయవంతమైందని, న్యూఢిల్లీ కార్యక్రమం అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

భారత వ్యవసాయ ప్రగతి శాస్త్రం, సాంకేతికత, అంతర్జాతీయ భాగస్వామ్యాల పరివర్తన శక్తికి నిదర్శనమని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్నారు. భారత విజయాలను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు ఇతర దేశాల అనుభవాల నుంచి నేర్చుకుని వ్యవసాయ, ఆహార వ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఉమ్మడి పరిష్కారాలను రూపొందించనున్నట్లు తెలిపారు.

పరిశోధన ఫలితాలను రైతులకు ఉపయోగపడే ఆచరణాత్మక పరిష్కారాలుగా మార్చడం, దక్షిణ--దక్షిణ సహకారాన్ని విస్తరించడం, వికసిత భారత్--2047 లక్ష్యాలకు వ్యవసాయ పరిశోధనల తోడ్పాటుపై న్యూఢిల్లీ సదస్సు దృష్టి సారించనుంది. కార్యక్రమ వివరాలు, వక్తల జాబితాను రానున్న నెలల్లో ప్రకటించనున్నారు.

భారత్--బెల్జియం--లక్సెంబర్గ్ ఆర్థిక బంధాల బలోపేతానికి చర్చలు

లక్సెంబర్గ్‌లో 19వ సంయుక్త ఆర్థిక కమిషన్ సమావేశం
లాజిస్టిక్స్, పునరుత్పాదక ఇంధనం, ఫిన్‌టెక్, ఆరోగ్య రంగాల్లో సహకారంపై దృష్టి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్, బెల్జియం, లక్సెంబర్గ్ దేశాలు పలు కీలక రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించాయి. భారత్--బెల్జియం--లక్సెంబర్గ్ ఆర్థిక సంఘం (బీఎల్ఈయూ) సంయుక్త ఆర్థిక కమిషన్ (జేఈసీ) 19వ సమావేశం అక్టోబర్ 29న లక్సెంబర్గ్‌లో జరిగింది. పరస్పర ప్రయోజనాల ఆధారంగా ఆర్థిక భాగస్వామ్యాన్ని విస్తరించడం, వాణిజ్య ప్రవాహాలను సులభతరం చేయడం, పెట్టుబడులను ప్రోత్సహించడం సమావేశంలో ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి.

భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్, బెల్జియం విదేశాంగ, విదేశీ వాణిజ్య, అభివృద్ధి సహకార శాఖ జియో ఎకానమీ--ఆర్థిక దౌత్య విభాగం డైరెక్టర్ జనరల్ ఫిలిప్ వాండెన్ బుల్కే, లక్సెంబర్గ్ విదేశీ, యూరోపియన్ వ్యవహారాలు, రక్షణ, అభివృద్ధి సహకారం, విదేశీ వాణిజ్య మంత్రిత్వ శాఖ సెక్రటరీ జనరల్ హెన్రీ షూమాకర్ ఈ సమావేశానికి సంయుక్త అధ్యక్షత వహించారు.

కీలక రంగాల్లో భాగస్వామ్యానికి అవకాశాలు

మూడు దేశాల మధ్య ప్రస్తుత వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను సమావేశం సమీక్షించింది. విమాన అనుసంధానం, నౌకాశ్రయాలకు ప్రాధాన్యమిస్తూ లాజిస్టిక్స్ రంగంలో సహకారాన్ని విస్తరించే అవకాశాలను పరిశీలించింది. పునరుత్పాదక ఇంధనం, స్వచ్ఛ సాంకేతికత, ఆర్థిక సేవలు, ఫిన్‌టెక్, డిజిటల్ పరివర్తన, సమాచార--కమ్యూనికేషన్ సాంకేతికత రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించారు.

ఆరోగ్య సంరక్షణ, జీవశాస్త్రాలు, ఆయుర్వేదం, సంప్రదాయ వైద్యం, వ్యవసాయ--ఆహార శుద్ధి పరిశ్రమల్లోనూ పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను సమీక్షించారు. ఆయా రంగాల్లో వ్యాపార సంస్థల అనుసంధానం, పెట్టుబడి భాగస్వామ్యాలను పెంపొందించే మార్గాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

ఏరోస్పేస్, పరిశోధనలకు ప్రాధాన్యం

ఏరోస్పేస్, పరిశోధన--ఆవిష్కరణలు, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే అవకాశాలను అన్వేషించాలని సమావేశం నిర్ణయించింది. వాణిజ్యపరమైన సమస్యల పరిష్కారం, మార్కెట్ ప్రవేశాన్ని సులభతరం చేయడం, ఆర్థిక సంబంధాల విస్తరణకు కొత్త అవకాశాలను గుర్తించడం వంటి అంశాలపైనా చర్చలు జరిగాయి.

తమ ఆర్థిక ప్రాధాన్యాలను వివరించిన మూడు పక్షాలు.. రంగాలవారీ సహకారాన్ని సమీక్షించాయి. పరస్పర ప్రయోజనకరమైన ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతర చర్చలు, సమన్వయం అవసరమని పునరుద్ఘాటించాయి.

భారత్‌లో దీర్ఘకాల పెట్టుబడులకు ఆహ్వానం

జేఈసీ సమావేశం అనంతరం లక్సెంబర్గ్‌కు చెందిన కంపెనీల సీఈఓలతో వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ సమావేశమయ్యారు. భారత ఆర్థిక వ్యవస్థ సాధిస్తున్న వృద్ధి, దేశంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు.

ఆర్థిక సేవలు, అధునాతన తయారీ, లాజిస్టిక్స్, స్వచ్ఛ ఇంధనం, డిజిటల్ సాంకేతికతలు, ఆరోగ్య సంరక్షణ, పరిశోధన--ఆవిష్కరణల రంగాల్లో కలిసి పనిచేయడానికి విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. భారత్‌లో దీర్ఘకాల పెట్టుబడులు పెట్టేందుకు, సాంకేతిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని లక్సెంబర్గ్ కంపెనీలను ఆహ్వానించారు. భారత సంస్థలతో అనుసంధానమై ప్రపంచ విలువ గొలుసుల్లో భాగస్వామ్యాన్ని విస్తరించుకోవాలని సూచించారు.

భారత్--బెల్జియం--లక్సెంబర్గ్ వాణిజ్య బంధాలకు మరింత బలం

లక్సెంబర్గ్‌లో 19వ సంయుక్త ఆర్థిక కమిషన్ సమావేశం
కీలక రంగాల్లో పెట్టుబడులు, సాంకేతిక సహకారంపై చర్చలు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: భారత్, బెల్జియం, లక్సెంబర్గ్ దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు జరిగాయి. భారత్--బెల్జియం--లక్సెంబర్గ్ ఆర్థిక సంఘం (బీఎల్ఈయూ) సంయుక్త ఆర్థిక కమిషన్ (జేఈసీ) 19వ సమావేశం అక్టోబర్ 29న లక్సెంబర్గ్‌లో నిర్వహించారు. ప్రస్తుత వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను సమీక్షించడంతోపాటు పలు ప్రాధాన్య రంగాల్లో సహకారాన్ని విస్తరించే అవకాశాలను మూడు దేశాల ప్రతినిధులు పరిశీలించారు.

భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్, బెల్జియం విదేశాంగ శాఖ పరిధిలోని భౌగోళిక ఆర్థిక వ్యవహారాలు--ఆర్థిక దౌత్య విభాగం డైరెక్టర్ జనరల్ ఫిలిప్ వాండెన్ బుల్కే, లక్సెంబర్గ్ విదేశీ వ్యవహారాలు, యూరోపియన్ వ్యవహారాలు, రక్షణ, అభివృద్ధి సహకారం, విదేశీ వాణిజ్య మంత్రిత్వ శాఖ సెక్రటరీ జనరల్ హెన్రీ షూమాకర్ సమావేశానికి సంయుక్త అధ్యక్షత వహించారు.

విమాన అనుసంధానం, నౌకాశ్రయాలకు ప్రాధాన్యమిస్తూ లాజిస్టిక్స్ రంగంలో భాగస్వామ్యంపై చర్చించారు. పునరుత్పాదక ఇంధనం, స్వచ్ఛ సాంకేతికత, ఆర్థిక సేవలు, ఫిన్‌టెక్, డిజిటల్ పరివర్తన, సమాచార--కమ్యూనికేషన్ సాంకేతికత రంగాల్లో సహకార అవకాశాలను సమీక్షించారు. ఆరోగ్య సంరక్షణ, జీవశాస్త్రాలు, ఆయుర్వేదం, సంప్రదాయ వైద్యం, వ్యవసాయ--ఆహార శుద్ధి పరిశ్రమల్లోనూ పరస్పర భాగస్వామ్యాన్ని పెంపొందించే అంశాలపై చర్చలు జరిగాయి.

ఏరోస్పేస్, పరిశోధన--ఆవిష్కరణలు, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే అవకాశాలను అన్వేషించాలని సమావేశం నిర్ణయించింది. వాణిజ్య సంబంధిత సమస్యలను పరిష్కరించడం, మార్కెట్లలో ప్రవేశాన్ని సులభతరం చేయడం, పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలను కూడా పరిశీలించారు.

మూడు పక్షాలు తమ ఆర్థిక ప్రాధాన్యాలను వివరించడంతోపాటు రంగాలవారీ సహకారాన్ని సమీక్షించాయి. వ్యాపార సంబంధాలు, పెట్టుబడి భాగస్వామ్యాలను పెంచేందుకు ఉన్న మార్గాలపై అభిప్రాయాలు పంచుకున్నాయి. పరస్పర ప్రయోజనకరమైన ఆర్థిక సంబంధాల పురోగతికి నిరంతర చర్చలు, సహకారం అవసరమని పునరుద్ఘాటించాయి.

సమావేశం అనంతరం లక్సెంబర్గ్‌కు చెందిన కంపెనీల సీఈఓలతో రాజేశ్ అగర్వాల్ సమావేశమయ్యారు. భారత ఆర్థిక వృద్ధి, దేశంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఆర్థిక సేవలు, అధునాతన తయారీ, లాజిస్టిక్స్, స్వచ్ఛ ఇంధనం, డిజిటల్ సాంకేతికతలు, ఆరోగ్య సంరక్షణ, పరిశోధన--ఆవిష్కరణల రంగాల్లో కలిసి పనిచేసేందుకు అవకాశాలున్నాయని తెలిపారు.

భారత్‌లో దీర్ఘకాల పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలకు ముందుకు రావాలని లక్సెంబర్గ్ కంపెనీలను ఆహ్వానించారు. భారత సంస్థలతో అనుసంధానమై అంతర్జాతీయ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థల్లో భాగస్వామ్యాన్ని విస్తరించుకోవాలని సూచించారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 31, 2026
www.trinetnews.com

మద్యం మత్తులో భార్యపై దాడి.. వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

•భర్త అరెస్ట్.. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు

భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కద్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మక్తమాదారం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి నమోదైన కేసులో నిందితుడైన భర్త ఎగిరిశెట్టి ఆంజనేయులును కద్తాల్ పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లి కేశంపేట మండలం చింతకుంటపల్లికి చెందిన కుమ్మరి సుగుణమ్మ కుమార్తె లావణ్య (29)కు సుమారు పదేళ్ల క్రితం మక్తమాదారం గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి ఆంజనేయులుతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈ క్రమంలో అక్టోబర్ 29న ఉదయం ఆంజనేయులు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య లావణ్యను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు శారీరకంగా దాడి చేసినట్లు మృతురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన లావణ్య అదే రోజు మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో వెల్లడించారు.

మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కద్తాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా నిందితుడు ఆంజనేయులును అక్టోబర్ 30న అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు కద్తాల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వి. సైదిరెడ్డి వెల్లడించారు.

మహిళలపై వేధింపులకు పాల్పడితే చర్యలులి

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తినప్పుడు ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకుండా పరస్పరం చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. గృహహింస, శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్న మహిళలు మౌనంగా భరించకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. అవసరమైన వారికి పోలీస్ శాఖ ద్వారా కౌన్సెలింగ్, రక్షణ, చట్టపరమైన సహాయం అందిస్తామని పేర్కొన్నారు.

మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, మహిళలపై వేధింపులకు పాల్పడే

(వివో') భవనాల నిర్మాణంలో వేగం పెంచాలి,

•విబిజి రాంజీ పథకం ద్వారా గ్రామాలు అభివృద్ధిచర్యలు,

•జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో (387) భవనాలు మంజూరు కాగా, (90) భవనాల నిర్మాణాలు ప్రారంభం కానీ నేపథ్యంలో సంబంధిత సర్పంచులు, అధికారులతో నిర్మాణం విషయంలో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు,

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో ప్రభుత్వం చేపడుతున్న '(వివో") భవనాల నిర్మాణం, వాటికి సంబంధించి తీసుకుంటున్న,

నిధుల సమర్థవంతమైన వినియోగం పారదర్శకత: వివో భవనాల నిర్మాణ పనులకు సంబంధించి కేటాయించిన నిధులు సకాలంలో విడుదలయ్యేలా చూస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిశీలనలు (మానిటరింగ్) నిర్వహించాలని,

స్థానిక సేవలకు కేటాయింపు

ఈ భవనాలు పూర్తయిన తర్వాత వాటిని కేవలం కార్యాలయాలుగా మాత్రమే కాకుండా, ప్రజలకు అవసరమైన వివిధ ప్రభుత్వ సేవలందిస్తూ బహుళ ప్రయోజన కేంద్రాలుగా (మల్టీ- పర్పస్ కమ్యూనిటీ స్పేసెస్) ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందించడం జరుగుతున్నదన్నారు,

నిర్మాణ వేగవంతం భూమిపూజ కార్యక్రమాలు పూర్తయిన చోట పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా భవనాల నిర్మాణాలు పూర్తయ్యేలా స్థానిక ప్రజాప్రతినిధులు , యంత్రాంగం సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ఈ భవనాల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన పాలనను మరింత వేగంగా అందించవచ్చు అనే గొప్ప ఉద్దేశంతో భవనాల నిర్మాణం చేపట్టిందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు,ఈ కార్యక్రమంలో డీఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, పిఆర్ఈఈ, డిపిఓ రేవంత్, డివిజనల్ పంచాయతీ అధికారి పుల్లారావు, ఏపిఓలు, సంబంధిత గ్రామాల సర్పంచ్ లు, వివో అధ్యక్ష, కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

డి పి ఆర్ఓ మహబూబాబాద్, వారిచే జారీ చేయనైనది.

ఎన్నికల నిర్వహణలో పోలీసుల తీరు దుర్మార్గం: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి.

ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు అపహాస్యమయ్యేలా పోలీసులు అనుసరిస్తున్న తీరు దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులను అడ్డం పెట్టుకొని ఎన్నికలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే ఎన్నికల్లో పోటీకి ముందుకొచ్చిన వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఫోన్ చేసి బెదిరించడమే దీనికి నిదర్శనం అన్నారు. మాచర్లలో 36 మంది వార్డు అభ్యర్థులు నామినేషన్లు వేశారని, భీఫారం సర్టిఫికెట్లను మున్సిపల్ అధికారులకు అందజేస్తుంటే పోలీసుల సాక్షిగా టిడిపి మూకలు చింపివేశారంటే ఎన్నికలు ఎంత పారదర్శకంగా జరుగుతున్నాయో అర్థమవుతుందన్నారు. 36వ వార్డు అభ్యర్థి రామ తులసి ని గంజాయి బ్యాచ్ అడ్డుకొని బ్లేడుతో రక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. నామినేషన్ల టైంలో మున్సిపల్ కార్యాలయంలోకి కర్రలు, గొడ్డళ్ళతో వందలాదిమంది రౌడీ మూకలు ఎలా వచ్చారో పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. అంతటితో ఆగకుండా మున్సిపల్ ఛైర్మన్ వైసిపి అభ్యర్థి షేక్ సుల్తానా తోపాటు 36 మంది వార్డు అభ్యర్థుల ఏజెంట్ ఫారాలను ఇవ్వమని మున్సిపల్ అధికారులు పిలిపించారని, అప్పటికే అక్కడికి చేరిన టిడిపి అల్లరి మూకలు ఏజెంట్ ఫారాలను చించివేసి అభ్యర్థులపై దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. మాచర్లలో పోలీసులు, అధికారులు, కూటమి నాయకులు కుమ్మక్కు యారని పిఆర్కే ఆరోపించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులకు కారంపూడి, దుర్గి, విజయపురిసౌత్, వెల్దుర్తి ఎస్సైలు ఎన్నికల్లో పాల్గొంటే ఇబ్బంది పడతారంటూ ఫోన్ కాల్ చేయడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫామ్ ముసుగులో పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పలువురు వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి శివారులో గంజాయి పట్టివేత.. ముగ్గురు అరెస్ట్

•20 గ్రా గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం: ఎస్ ఐ నరసింహరావు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కాకతీయ వెంచర్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి 20 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్కతుర్తి గ్రామ శివారులోని కాకతీయ వెంచర్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు.అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకుని విచారించగా, దామెర గ్రామానికి చెందిన రొడ్డాబోయిన శ్రీధర్, మట్టెడ జశ్వంత్, ఉప్పాల గణేష్‌గా గుర్తించారు.వీరికి గత రెండేళ్లుగా గంజాయి సేవించే అలవాటు ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో శ్రీధర్ హుజూరాబాద్‌కు వెళ్లి ఆకాష్ అనే వ్యక్తి వద్ద 30 గ్రాముల గంజాయిని రూ.1,500కు కొనుగోలు చేసినట్లు తెలిసింది.అనంతరం కొంత గంజాయిని సేవించి, మిగిలిన దానిని ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.వారి వద్ద నుంచి 20 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి కొనుగోలు, విక్రయాలు, వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.ఈ తనిఖీల్లో ఎల్కతుర్తి ఎస్ఐ నరసింహారావు, కానిస్టేబుల్ బక్కన్నతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుణ్ణంపల్లి, కన్నాపురంలో ఎన్నికల అవగాహన సదస్సు

ఏలూరు జిల్లాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంత వా తా వ ం ణ ం లో నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం క్షేత్రస్థాయిలో చర్యలను ముమ్మరం చేసింది.జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు భీమడోలు సీఐ శ్రీకృష్ణ, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ ఆధ్వర్యంలో గుణ్ణంపల్లి, పి.కన్నాపురం గ్రామాల్లో ప్రత్యేక ఎన్నికల అవగాహన సదస్సులు శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శ్రీకృష్ణ మాట్లాడుతూ... ఎన్నికలు ఐదేళ్లకు ఒకసారి వచ్చే ప్రజాస్వామ్య ప్రక్రియ మాత్రమేనని, దీని కోసం పల్లెల్లో వర్గాలుగా విడిపోయి గొడవలు పడకూడదని హితవు పలికారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో ఐక్యత పాటించాలన్నారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఓటర్లను ప్రలోభపెట్టడం, డబ్బు, కానుకలు, మద్యం పంపిణీ వంటి అక్రమాలకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఎవరి ఒత్తిళ్లకు, బెదిరింపులకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ట్రబుల్ మేకర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని స్పష్టం చేశారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోదా అమ్మవారికి తొమ్మిది గంటలు కుంకుమ పూజ

శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రము బూరుగడ్డ లో "ప్రతి శుక్రవారం" ఉదయం శ్రీ గోదా అమ్మవారికి 9 గంటలకు కుంకుమ పూజ కార్యక్రమం అనంతరం 10-00 గంటలకు "గోమాతకి" (ఆవుకి) గోపూజ కార్యక్రమం నిర్వహించబడును,

ఈ కార్యక్రమంలో:- ఆలయ కార్యానిర్వహణాధికారి నాగేళ్ల శంబిరెడ్డి. ఆలయ చైర్మన్ యరగాని భిక్షం గౌడ్, ఆలయ ధర్మకర్తలు:- యరగాని సతీష్ గౌడ్. ప్రార్థన బోయిన గంగయ్య. గూడెపు నాగలింగం. అద్దంకి సంధ్య నాగేశ్వరావు. పిట్టల గురవయ్య. కాస్తల శంకర్. ఆలయ అర్చకులు ముదుంబై హరీష్ కుమారా చార్యులు. మరియు

మార్కెట్ కమిటీ చైర్మన్ దేశ్ముఖ్ రాధికా అరుణ్ కుమార్ దేవాలయనికి విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు, శాశ్వత గోపూజకు సహకరించిన వారు లిములుగు భాస్కర్ ధర్మపత్ని వీణ దంపతులు (ఖూూ) వాస్తవ్యులు

మంగళగిరి శలమాచార్యులు ధర్మపత్ని దేవకీ దంపతులు

ఎంపీ లక్ష్మణరావు ధర్మపత్ని లక్ష్మీ శైలజ దంపతులు (కార్యనిర్వహణ అధికారి గ్రేడ్-1) మరియు చీూ= ఫ్రూట్స్ నాలం శ్రీనివాసరావు దంపతులు

మరియు సీతారాం. వీరబాబు. సత్యనారాయణ. కొత్త కళావతి. ముదుంబై లక్ష్మి. విజయలక్ష్మి అరుణమ్మ. వెంకాయమ్మ. కవిత. సరిత. మరియు ఆలయ సిబ్బంది వై కిరణ్ గౌడ్, వై రమేష్. వై ఉపేందర్. మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు,

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలి

నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఓటు హక్కు పరిరక్షణ -- ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ,నిరసన ర్యాలీని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ డిండి మండలాధ్యక్షుడు గడ్డమీది సాయి శుక్రవారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు,ఎన్నికల సంఘం జవాబుదారీతనం,ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా తదితర అంశాలను ప్రస్తావించనున్నారని తెలిపారు.ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ప్రజలకు,పార్టీ శ్రేణులకు తెలియజేస్తూ,ప్రజాస్వామ్య విలువలు,ఓటు హక్కు పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో గంట చోరీ

రూ.7,500 విలువైన గంట అపహరణ..

ఆలయాల వద్ద పోలీసుల గస్తీ పెంచాలని గ్రామస్తుల విజ్ఞప్తి

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు గంటను చోరీ చేశారు.గురువారం రాత్రి ఆలయ మండపంలో ఉన్న సుమారు రూ.7,500 విలువైన గంటను దుండగులు అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు.శుక్రవారం ఉదయం గౌడ కులస్తులు ఆలయానికి వెళ్లగా గంట కనిపించకపోవడంతో పరిశీలించగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు మండ సారంగం మాట్లాడుతూ ఆలయాల్లో చోరీలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

డిండి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలోని డిండి మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలపై శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ టీజీటీ లందరికీ నేషనల్ ఇంక్రిమెంట్స్ అందరికీ వర్తింప చేయాలని,మోడల్ స్కూల్లను విద్యా శాఖలో విలీనం చేసి 010 పద్దు కింద జీతాలు ఇప్పించాలని కోరారు.317 జీవో కూడా అమలు చేయాలని,కారుణ్య నియామకాలు కూడా చేపట్టాలని,హెచ్.బి.టి. జీతాల ను పెంచాలని ఏరియార్సు ఇవ్వాలనే డిమాండ్లతో వారు నిరసనలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్యాంసుందర్,ఎం శ్రీలత,రమా,సుశీల,పులి కోదండ రామారావు,ఎన్.ఎన్. విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, సోమయ్య,రవి,వి విజయ్ కుమార్,రమేష్, అశ్విని,జ్యోతి,రుంషా,శ్రీను శ్రీలత, సందీప్, ధనలక్ష్మీ,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి కూటమి అభివృద్ధి - అందుగుల ప్రచారం

ద్వారకాతిరుమల మండలం ఎంపీటీసీ-2 కూటమి అభ్యర్థి అందుగుల రాములు శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని కొనసాగించారు.గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆశీస్సులతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు.ప్రజల సంక్షేమం, భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాయు కాలుష్య నియంత్రణకు 'పవన్--ఐ3సీ'తో సాంకేతిక నిఘా

30కి పైగా సమాచార ప్రవాహాల అనుసంధానం..
ఢిల్లీ--ఎన్‌సీఆర్‌లో నిరంతర పర్యవేక్షణ
కాలుష్యాన్ని ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలి: భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
వాయు కాలుష్యం పెరిగిన తర్వాత స్పందించే విధానం నుంచి.. ముందుగానే అంచనా వేసి తక్షణ చర్యలు చేపట్టే దిశగా ముందుకు సాగుతున్నామని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) న్యూఢిల్లీలో అభివృద్ధి చేసిన 'పవన్--ఐ3సీ' సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. కేంద్రంలోని సాంకేతిక వ్యవస్థలు, కార్యాచరణ సన్నద్ధత, కాలుష్య నియంత్రణ పర్యవేక్షణ విధానాలను సమీక్షించారు.

ఎన్‌సీఆర్‌లో వాయు నాణ్యత నిఘా, విశ్లేషణ కోసం రూపొందించిన 'పవన్' వేదిక.. వివిధ సంస్థల వద్ద ఉన్న సమాచారాన్ని ఒకేచోట అందుబాటులోకి తీసుకొస్తుంది. వాయు నాణ్యత, ఉద్గారాలు, వాతావరణం, ఉపగ్రహ చిత్రాలు, కెమెరా దృశ్యాలు, వాహన రాకపోకలు, ప్రజా ఫిర్యాదులు, నిబంధనల అమలుకు సంబంధించిన 30కి పైగా ఏపీఐలు, సమాచార ప్రవాహాలను అనుసంధానించారు.

ఢిల్లీ--ఎన్‌సీఆర్‌లో పనిచేస్తున్న 111 నిరంతర వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు, 2,300కు పైగా పరిశ్రమలు, 3,200కు పైగా క్రియాశీల నిర్మాణ ప్రదేశాలతోపాటు ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల సమాచారాన్ని ఈ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించనున్నారు.

ఖచ్చితమైన సమాచారంతో సత్వర చర్యలు

ప్రాంతీయ వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు స్థానిక స్థాయిలో ఖచ్చితమైన సమాచారం, పూర్తి పారదర్శకత అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. వేర్వేరు సంస్థల వద్ద విడివిడిగా ఉన్న సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా చర్యల్లో జాప్యాన్ని తగ్గించవచ్చన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లు ఒకే ధ్రువీకృత సమాచారాన్ని ఆధారంగా చేసుకుని కాలుష్య కారకాలపై వేగంగా చర్యలు తీసుకోవడానికి ఈ కేంద్రం తోడ్పడుతుందని తెలిపారు.

స్వచ్ఛమైన గాలిని సాధించడం ఏ ఒక్క సంస్థతోనో, రాష్ట్రంతోనో సాధ్యం కాదన్నారు. పంట వ్యర్థాల దహనం, పరిశ్రమల ఉద్గారాలు, కప్పి ఉంచని నిర్మాణ ప్రదేశాలను తక్షణమే గుర్తించి సంబంధిత సంస్థలను అప్రమత్తం చేయడం ఈ వేదిక ప్రత్యేకత అని వివరించారు. అందిన హెచ్చరికలపై అమలు సంస్థలు ఆలస్యం లేకుండా స్పందించాలని సూచించారు.

కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా నవంబర్ 5 నుంచి 20 వరకు ఎన్‌సీఆర్ ప్రాంతవ్యాప్తంగా నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

'గుర్తింపు--విశ్లేషణ--చర్య' విధానంలో నిర్వహణ

'గుర్తించు.. విశ్లేషించు.. చర్య తీసుకో' అనే సూత్రంతో పవన్--ఐ3సీ పనిచేస్తుందని భూపేందర్ యాదవ్ వివరించారు. ప్రస్తుత, గత కాలుష్య స్థాయిలను విశ్లేషించడం, కాలుష్య మూలాలను గుర్తించడం, నియంత్రణ చర్యల ప్రభావాన్ని అంచనా వేయడం, క్షేత్రస్థాయిలో నిబంధనల అమలును పర్యవేక్షించడం దీని ప్రధాన లక్ష్యాలని తెలిపారు.

నిర్దేశిత ప్రమాణాలు, చట్టబద్ధ ఆదేశాలు, అమలు చేయాల్సిన నిబంధనల నుంచి ఉల్లంఘనలు నమోదైతే సంబంధిత సంస్థలకు హెచ్చరికలు వెళ్తాయి. అవసరమైన చర్యల కోసం అంశాన్ని ఉన్నతస్థాయికి తెలియజేసే సదుపాయం కూడా ఉంది. ఈ విధానం ద్వారా ముందస్తు జోక్యం, సత్వర నియంత్రణ చర్యలు సాధ్యమవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయడంతోపాటు స్థానికంగా కాలుష్యం ఒక్కసారిగా పెరిగినప్పుడు వెంటనే స్పందించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

పరిశ్రమల నుంచి పంట వ్యర్థాల దహనం వరకు నిఘా

పర్యటనలో పరిశ్రమల ఉద్గారాలు, ఉపగ్రహాల ఆధారంగా పంట వ్యర్థాల దహనం గుర్తింపు, నిర్మాణ--కూల్చివేత ప్రదేశాల్లో ప్రత్యక్ష కెమెరా దృశ్యాలు, ధూళి కణాల సెన్సర్ల సమాచారాన్ని మంత్రి పరిశీలించారు. పంట వ్యర్థాల దహన ఘటనలను గత ఆరేళ్ల గణాంకాలతో పోల్చే సదుపాయాన్ని సమీక్షించారు.

ఓఖ్లా, భల్స్వా, ఘాజీపూర్, గ్రేటర్ నోయిడా, బంధ్వారీ చెత్త నిల్వ కేంద్రాల ప్రత్యక్ష దృశ్యాలు, వాతావరణ పరిస్థితులు, గాలి వేగం--దిశ, వర్షపాతం, తేమ వివరాలను కూడా ఈ వేదిక అందిస్తుంది. 'వాహన్' ద్వారా వాహన సమాచారం, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, గ్రీన్ ఢిల్లీ--సమీర్ యాప్‌ల ద్వారా ప్రజా ఫిర్యాదులు, యాంత్రిక రోడ్డు శుభ్రపరిచే వాహనాల కదలికలను పర్యవేక్షించవచ్చు. హరియాణా, పంజాబ్ ఇటుక బట్టీల్లో నిర్దేశిత బయోమాస్ ఇంధన వినియోగ నిబంధనల అమలును కూడా పరిశీలించనున్నారు.

ఢిల్లీ, హరియాణా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కార్యాచరణ ప్రణాళికల్లో పెండింగ్ చర్యలను రాష్ట్రం, రంగం, అంశాలవారీగా పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. వాహన, పారిశ్రామిక కాలుష్యం, రోడ్డు ధూళి, పంట వ్యర్థాలు, పురపాలక ఘన వ్యర్థాల నిర్వహణ, డీజిల్ జనరేటర్లు, పర్యావరణహిత దహనవాటికలు తదితర అంశాలను ఇందులో చేర్చారు.

కార్యక్రమంలో సీఏక్యూఎం చైర్‌పర్సన్ రాజేశ్ వర్మ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్‌పర్సన్, కేంద్ర పర్యావరణ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ అమన్‌దీప్ గార్గ్‌తోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బుర్జ్ ఖలీఫా, సెంటోసా ఆన్‌లైన్ బుకింగ్‌లకు యూపీఐ

యూఏఈ, సింగపూర్ వెళ్లే భారత పర్యాటకులకు సులభతరమైన చెల్లింపులు
పది దేశాల్లో అందుబాటులో భారత డిజిటల్ చెల్లింపు సేవలు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), సింగపూర్ సందర్శించే భారత పర్యాటకులకు డిజిటల్ చెల్లింపులు మరింత సులభతరమయ్యాయి. దుబాయ్‌లోని 'అట్ ది టాప్, బుర్జ్ ఖలీఫా', సింగపూర్‌లోని 'రిసార్ట్స్ వరల్డ్ సెంటోసా' ఆకర్షణలకు ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు చేసుకునేందుకు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. భారతీయులు తమకు పరిచయమైన యూపీఐ యాప్‌లతోనే ఈ చెల్లింపులు చేయవచ్చు.

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) భాగస్వామ్యాల ద్వారా ఈ సదుపాయం కల్పించింది. యూఏఈలో ఆన్‌లైన్ బుకింగ్‌లకు యూపీఐ సేవలను ప్రవేశపెట్టే భాగస్వామ్యాన్ని 2026 జూలై 29న, సింగపూర్‌కు సంబంధించిన భాగస్వామ్యాన్ని సెప్టెంబర్ 9న ప్రకటించింది. యూఏఈలో నియోపే, ఎమ్మార్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి 'అట్ ది టాప్, బుర్జ్ ఖలీఫా' ఆన్‌లైన్ బుకింగ్‌లకు యూపీఐ చెల్లింపులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ--కామర్స్ లావాదేవీలకు యూపీఐను అమలు చేసిన తొలి యూఏఈ పర్యాటక ఆకర్షణగా ఇది నిలిచింది. సింగపూర్‌లో చెల్లింపు సేవల సంస్థ ఫోమో పేతో కలిసి రిసార్ట్స్ వరల్డ్ సెంటోసాకు యూపీఐ సేవలను విస్తరించారు. ఇందులోని యూనివర్సల్ స్టూడియోస్ సింగపూర్, సింగపూర్ ఓషనేరియం, అడ్వెంచర్ కోవ్ వాటర్‌పార్క్ వంటి ఆకర్షణలకు ఆన్‌లైన్ బుకింగ్‌ల సమయంలో యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. 2025లో సింగపూర్‌ను 12 లక్షల మంది భారతీయులు సందర్శించిన నేపథ్యంలో ఈ సదుపాయం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతర్జాతీయ పర్యాటక కేంద్రాల్లో విశ్వసనీయమైన, సులభమైన చెల్లింపు సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఈ అనుసంధానం తీర్చనుంది. భారత్‌తో యూఏఈ, సింగపూర్‌ల డిజిటల్, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయనుంది. డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సరిహద్దులు దాటిన వాణిజ్య చెల్లింపులను సులభతరం చేయడం, భారత సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటే అంతర్జాతీయ భాగస్వామ్యాలకు కట్టుబడి ఉన్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటికే పారిస్‌లోని ఈఫిల్ టవర్ టికెట్లను యూపీఐ ద్వారా కొనుగోలు చేసే సదుపాయాన్ని 2024 జనవరి 26న ప్రారంభించారు. ప్రస్తుతం సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, మారిషస్, నేపాల్, భూటాన్, ఖతార్, శ్రీలంక, కంబోడియా, గ్రీస్ దేశాల్లో యూపీఐ చెల్లింపులకు ఆమోదం ఉన్నట్లు ప్రకటన పేర్కొంది. ప్రధానమంత్రి ఉజ్బెకిస్థాన్ పర్యటన సందర్భంగా 2026 ఆగస్టు 30న ప్రకటించిన వాణిజ్య ఒప్పందం మేరకు.. యూపీఐ సేవలు అందుబాటులోకి

పెట్టుబడులకు, ప్రజల జీవన ప్రమాణాలకు
హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతాం

యువతకు నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు.. జిల్లాల విద్యార్థులకూ ఐటీ రంగంలో ప్రాధాన్యం
ఇన్ఫోసిస్ విస్తరణతో హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థల విశ్వాసం మరింత బలోపేతం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
పెట్టుబడులకు అనుకూలమైన నగరంగానే కాకుండా, ప్రజలు మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించేందుకు అనువైన ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మెరుగైన మౌలిక సదుపాయాలు, వేగవంతమైన పరిపాలన, నిరంతర విద్యుత్ సరఫరా, పర్యావరణహిత అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ?మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో విస్తరణలో భాగంగా నిర్మించిన నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ ప్రతినిధులు వారికి ఘన స్వాగతం పలికారు. సంస్థ ప్రస్థానం, అంతర్జాతీయ కార్యకలాపాలు, పోచారం క్యాంపస్ ప్రత్యేకతలు, నూతన భవన విస్తరణ, ఆధునిక సదుపాయాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఉప ముఖ్యమంత్రి, మంత్రికి వివరించారు. అనంతరం వారు నూతన కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇన్ఫోసిస్ సంస్థ హైదరాబాద్‌లో మరోసారి పెట్టుబడులు పెట్టడం నగరంపై ఆ సంస్థకున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 48 వేల మందికి పైగా ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇన్ఫోసిస్, పది లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్ర ఐటీ రంగ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

??ఐటీ రంగం వేలాది కుటుంబాల జీవితాల్లో ఆర్థిక, సామాజిక మార్పులకు కారణమైందని, యువతకు ఉపాధితోపాటు కుటుంబాల అభ్యున్నతికి బాటలు వేసిందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ)తో సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడుతున్న నేపథ్యంలో యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం, ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాన్ని పెంచాలని, ముఖ్యంగా జిల్లాల కళాశాలల విద్యార్థులకు ఐటీ రంగంలో సమాన అవకాశాలు కల్పించాలని ఇన్ఫోసిస్‌ను కోరారు.

రాహుల్ స్పందించకపోవడంతో..
సోనియాకు వ్యాపార సంఘాల లేఖ

సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండుతో నవంబర్ 1న మెగా ర్యాలీకి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీ ని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు (ణవశ్రీష్ట్రఱ ˉత్థుఱవతీం) రాహుల్ గాంధీని పలుమార్లు అభ్యర్థించాయి. ఆయన నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో.. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' (జు×) లేఖ రాసింది. తమ వ్యాపారాలకు ఎంతో కీలకమైన దీపావళి పండగకు ముందు ర్యాలీలు నిర్వహించడం వల్ల దిల్లీలోని అనేక ప్రధాన మార్కెట్లలో వాణిజ్య కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

వ్యాపారంపైనే ఆధారపడుతున్న కుటుంబాల గురించి ఆలోచించి, కాంగ్రెస్ ర్యాలీని నవంబర్ 10 లేదా 11వ తేదీలకు వాయిదా వేయాలని సోనియా (రాశీఅఖు +ఖుఅనష్ట్రఱ)కు సీటీఐ విజ్ఞప్తి చేసింది. లేదంటే వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసన ప్రదేశాన్ని మార్చాలని లేఖలో కోరింది. 'మేము రాజకీయ ప్రదర్శనను వ్యతిరేకించట్లేదు. దానివల్ల పండగ సీజన్‌లో వ్యాపారాలు, జీవనోపాధిపై పడే ప్రభావంపైనే ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. ఈ ర్యాలీ వల్ల ఇరుకైన దిల్లీ వీధుల్లోకి లక్షలమంది నిరసనకారులు, 20వేల వాహనాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్న వాణిజ్య ప్రాంతాలలో దాదాపు రూ.12వేల కోట్ల విలువైన వ్యాపారం ప్రభావితం అవుతుంది' అని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ లేఖలో తెలిపారు.

బీజేపీతో పొత్తుకు బీఆర్ఎస్ తహతహ.. చంద్రబాబుతో సయోధ్యకు బావబామ్మర్దుల ప్రయత్నాలు:

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం అర్థమైంది

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గతంలో చంద్రబాబు నాయుడుపై తీవ్ర విమర్శలు చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఆయనను పొగుడుతూ సయోధ్యకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీజేపీతో పొత్తులో భాగంగానే చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకు బావబామ్మర్దులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌పై అబద్ధపు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా, చంద్రబాబు, టీడీపీ, బీజేపీపై విమర్శలు చేయకపోవడమే వారి మధ్య ఉన్న చీకటి ఒప్పందానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌కు దమ్ముంటే ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించాలని సవాల్ విసిరారు. బీజేపీకి సహకరించేందుకు మహబూబ్‌నగర్ స్థానాన్ని వదులుకుంటూ, నల్గొండ ఎమ్మెల్సీ స్థానంలో రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న రహస్య రాజకీయ బంధాన్ని ఆధారాలతో తెలంగాణ ప్రజల ముందు బయటపెడతామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

ఎన్‌సీఎల్‌టీ సభ్యుల నియామకాల్లో ఎంసీఏది పరిపాలనా పాత్రే

అధికారులు, సిబ్బంది నియామకాలను ట్రైబ్యునల్ స్వతంత్రంగా చేపడుతుందని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లోని 63 మంది న్యాయ, సాంకేతిక సభ్యుల నియామక ప్రక్రియ నిర్వహణలో తమ పాత్ర పరిపాలనాపరమైనదేనని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ) స్పష్టం చేసింది. ఎన్‌సీఎల్‌టీ సిబ్బంది వ్యవహారాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలకు సంబంధించి వెలువడిన కొన్ని వార్తల నేపథ్యంలో మంత్రిత్వ శాఖ ఈ వివరణ ఇచ్చింది.

ఎంసీఏ, ఎన్‌సీఎల్‌టీలకు అప్పగించిన బాధ్యతలు వేర్వేరుగా ఉన్నాయని పేర్కొంది. ట్రైబ్యునల్‌లో న్యాయ, సాంకేతిక సభ్యుల నియామక ప్రక్రియకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను మాత్రమే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుందని తెలిపింది.

డిప్యూటీ రిజిస్ట్రార్లు, కోర్టు అధికారులు, స్టెనోగ్రాఫర్లు, కార్యాలయ సహాయకులు, మల్టీ టాస్కింగ్ సిబ్బంది సహా తన అధికారులు, సిబ్బంది నియామకాలు, నిర్వహణ ప్రక్రియను ఎన్‌సీఎల్‌టీ స్వతంత్రంగా చేపడుతుందని వివరించింది.

ట్రైబ్యునల్ సమర్థంగా, స్వతంత్రంగా పనిచేసేందుకు వీలుగా 2019 అక్టోబర్ 14న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వం ఈ బాధ్యతలను ఎన్‌సీఎల్‌టీకి అప్పగించినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు వేగవంతం చేయండి

నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వండి
అనంతారంలో మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి
రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సీఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. వికారాబాద్ -- కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని సీఎం కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (===) పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్– గద్వాల్, కల్వకుర్తి -- మాచర్ల, కాచిగూడ కాచిగూడ --జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు -- ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ -- లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికలతో ప్రతిపక్షాలు గల్లంతు

●అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించాలి

●ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు పట్టభద్రుల ఉచిత ఓటర్ నమోదు కార్యాలయం టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మెన్ నేనావత్ పత్య నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం లతో కలిసి ప్రారంభిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కాంగ్రెస్ శ్రేణులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా పాలన తో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ విద్య ఉద్యోగాలలో పెద్దపీట వేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తూ ఉద్యోగులకు తమ హక్కులను నెరవేరుస్తూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పాలను చూసి పట్టబదులందరూ కాంగ్రెస్ పక్షాన ఉన్నారని వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ కనుమరుగ అవుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. అన్నారు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు మున్సిపాలిటీలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు నమోదు ఎన్రోల్మెంట్ కేంద్రాన్ని శుక్రవారం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగంలతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించి, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియను సమర్థంగా నిర్వహించి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నమోదు కేంద్రం ఇన్చార్జులు ఎంగలి ప్రసాద్, నాగిళ్ల వెంకటేష్, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ ప్రశాంతి రవికుమార్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ కృష్ణ నాయక్, ఎంఎ ఖలీల్, మాజీ వార్డ్ సభ్యుడు పూసల సత్యం, కొండల్ రెడ్డి, అబ్దుల్ అలీమ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ఫరీద్, నియోజకవర్గ నాయకులు ఫిరోజ్, శ్రీ నాయక్, మల్లేష్ నాయక్, గుద్దేటి శివ, కుమార్ గౌడ్, నాజర్, రఫీ, పూసల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీతో తెలంగాణ బంధం మరింత బలోపేతం కావాలి

అంతర్జాతీయ పెట్టుబడులు, పర్యాటకం, సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు

జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: భారత్, జర్మనీ దేశాల మధ్య 75 ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని రాష్ట్ర క్రీడా , యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ హోటల్ లో జరిగిన జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హోస్పర్‌కు, జర్మనీ ప్రభుత్వానికి, ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యత, పరస్పర అవగాహన, ఉమ్మడి భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలనే సందేశాన్ని జర్మన్ ఐక్యతా దినోత్సవం ప్రపంచానికి అందిస్తోందన్నారు. భారత్‌కు జర్మనీ ముఖ్యమైన ఆర్థిక భాగస్వామ్య దేశమని, ఇంజినీరింగ్, ఆటోమొబైల్ తయారీ, ఐటీ, పరిశోధన, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య మంచి సహకారం కొనసాగుతోందన్నారు. 2024లో ఇరు దేశాల మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 50 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిందని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన సాంకేతిక వ్యవస్థలతో హైదరాబాద్ అంతర్జాతీయ కంపెనీలకు ప్రధాన గమ్యస్థానంగా ఎదిగిందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో డాయిష్ బోర్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం అంతర్జాతీయ సంస్థలకు నగరంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. అధునాతన తయారీ, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఐటీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీ కంపెనీలను తెలంగాణకు ఆహ్వానించారు. జర్మనీలోని థ్యూరింగియా రాష్ట్రంతో నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సహకారం పెరుగుతోందని వివరించారు.

తెలంగాణ సంస్కృతి, పర్యాటకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెలంగాణకు గొప్ప చరిత్ర, విశిష్టమైన సాంస్కృతిక వారసత్వం ఉందని మంత్రి పేర్కొన్నారు. కాకతీయుల నిర్మాణ వైభవం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, హైదరాబాద్ చారిత్రక కట్టడాలు రాష్ట్ర పర్యాటక ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు, చేనేత, హస్తకళలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని చెప్పారు. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని, జర్మనీతో వంటకాల పండుగలు, చెఫ్‌ల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సాంస్కృతిక సంబంధాలను మరింత పెంపొందించవచ్చన్నారు.

హైదరాబాద్‌తో పాటు వరంగల్ కాకతీయ వారసత్వ సంపద, రామప్ప దేవాలయం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, సరస్సులు, జలపాతాలు, అటవీ ప్రాంతాలు, సంప్రదాయ గ్రామాలను సందర్శించాలని జర్మనీ పర్యాటకులకు మంత్రి ఆహ్వానం పలికారు. 50 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యం తెలంగాణను దేశంలోని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025--2030 ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, ఐదు లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పాలసీ తొలి సంవత్సరంలోనే 22,174 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హోటళ్లు, రిసార్టులు, వారసత్వ పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, ఆతిథ్య రంగ విద్యలో పెట్టుబడులు పెట్టాలని జర్మనీ సంస్థలకు పిలుపునిచ్చారు.

భారత్--జర్మనీ మధ్య 75 ఏళ్ల స్నేహబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తూ, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత దృఢపరచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హోస్పర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చెయ్యాలి

●రాష్ట్రం లో పది సెంటర్ లు ఏర్పాటు చేయాలీ

●పల్లా దేవేందర్ రెడ్డి

●అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా అధ్యక్షులు

తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు 10 కేంద్రాలు ఏర్పాటు చేయాలని, విజయవాడ కేంద్రంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కోర్టు వెంటనే అమల్లోకి తేవాలని త్వరితగతిలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం సమావేశం దేవరకొండ సిపిఐ కార్యాలయం లో శుక్రవారం ఏం యాదగిరి అధ్యక్షత న జరిగింది. ఈ సందర్భంగా పల్లా

దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన 12 సంవత్సరాలు గా పోరాడుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదని భాదను వ్యక్తం చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు రాష్ట్రంలో 10 కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేకపోతే బాధితులు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని, తద్వారా వారిపై ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. తెలంగాణలో 3 సెంటర్ లకు బదులు 10 కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాధితులకు సౌలభ్యంగా ఉంటుందని సూచించారు.

అగ్రిగోల్డ్ భాదితులు ధైర్యంగా ఉండాలని సమస్య పరిష్కారానికి అసోసియేషన్ నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. కోర్టు పర్యవేక్షణలో అగ్రిగోల్డ్ భూములకు వేలం నిర్వహించాలని భూములను చిన్నచిన్న కమతాలుగా చేసి బహిరంగ వేలం ద్వారా విక్రయించడం వలన అధిక మొత్తంలో డబ్బు సమకూరుతుందని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెరిఫికేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు ఏం యాదగిరి జి శ్రీనివాస్ , వి కేశవులు, బి కుమార్, డి సతీష్, ఆర్ వెంకన్న, వనం భాస్కర్, సిహెచ్ రాజేష్,ఎ సుమతి ,జి హేమలత, వి బాబు సంతోష లింగయ్య తదితరులు పాల్గొన్నారు

డాన్స్ మాస్టర్ శేఖర్ కు అండగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

●రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేత.. మరో రూ. 5 వేలు సహాయం అందించిన భావండ్ల మధు

కల్వకుర్తి పట్టణంలోని 21 వ వార్డు ఇందిరానగర్ కాలనీ లో నివాస ఉంటున్న డాన్స్ మాస్టర్, రిపోర్టర్, ఏదుల శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న డాన్స్ మాస్టర్ శేఖర్ ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా శేఖర్ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బావండ్ల మధు రూ 5

వేలు సహాయం అందించడంతోపాటు కుటుంబానికి నెల రోజులపాటు సరిపడ కిరాణా సరుకులు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ. శేఖర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని కుటుంబానికి భరోసా కల్పిస్తానని తెలిపారు కష్టకాలంలో బాధిత కుటుంబాన్నికి అండగా ఃనిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయన వెంట సూర్య లత కాటన్ మిల్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ సూర్య ప్రకాష్ రావు, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బావండ్ల మధు, మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్య, భగత్ సింగ్, బండారి శ్రీను వట్టెపు కిషోర్, భీమ్లా నాయక్, రామకృష్ణ, రవి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలి.రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలకు ఎమ్మెల్సీ ఓటుతో సమాధానం చెప్పాలి

●అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

●బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ సూచించారు.శుక్రవారం దేవరకొండ పట్టణంలోని భవిత జూనియర్, డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేట్లను కలిసి ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు ఎంతో విలువైనదని, యువత తమ హక్కులను కాపాడుకోవడంతో పాటు ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా నిలవాలని అన్నారు.రాష్ట్రంలో నిరుద్యోగులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసిందో పట్టభద్రులు ఆలోచించాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే సమయం ఆసన్నమైందని అన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి గ్రాడ్యుయేట్లు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు."మీ ఓటు మీ గొంతుక.. మీ ఓటు మీ భవిష్యత్తుకు బాట" అని పేర్కొంటూ, పట్టభద్రుల హక్కుల పరిరక్షణ కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని బొడ్డుపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లావత్ లక్ష్మణ్, చాట్ల ప్రశాంత్, రాంబాబు, శ్రీరాములు, వెంకట్

బి. గౌరారం గ్రామంలో రీ-సర్వే పనుల క్షేత్రస్థాయి పరిశీలన

●సర్వే నంబర్ 43లో రీ-సర్వే పనులను సందర్శించి పరిశీలించిన అధికారులు

నాంపల్లి మండల పరిధిలోని బి. గౌరారం గ్రామంలో సర్వే నంబర్ 43లో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే పనులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను సర్వే పనుల పురోగతిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

రీ-సర్వేలో భాగంగా భూముల సరిహద్దులు సర్వే నంబర్లు భూముల విస్తీర్ణం సంబంధిత భూ రికార్డుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.భూ రికార్డుల్లో నమోదైన వివరాలకు క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు మధ్య ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వాటిని గుర్తించి సంబంధిత వివరాలను నమోదు చేయడంపై దృష్టి సారించారు.రీ-సర్వే ప్రక్రియ ద్వారా భూములకు సంబంధించిన వివరాలను స్పష్టంగా గుర్తించి భవిష్యత్తులో భూ వివాదాలు సరిహద్దుల సమస్యలు తలెత్తకుండా చూడటం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతులు భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రీ-సర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

భూముల సర్వే అనేది రైతులకు భూ యజమానులకు ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశమని ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి సరైన సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు.రీ-సర్వే పనుల్లో స్థానిక రైతులు భూ యజమానులు తమ భూములకు సంబంధించిన పత్రాలు ఇతర వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ), సర్వేయర్ రీ-సర్వే పనులకు సంబంధించిన అధికారులు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయాలి,

●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు రైతులకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సులభంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్రిస్టాక్ డిజిటల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో అగ్రిస్టాక్ అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ రైతు ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం అగ్రి స్టాక్ డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, ఇందులో రైతు గుర్తింపు సంఖ్య, భౌగోళిక సమాచారంతో కూడిన గ్రామ మ్యాపుల నమోదు, పంట సాగు నమోదు రిజిస్ట్రీలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో రైతు ఐడిల నమోదులో 70.4 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, జిల్లాలోని గ్రామాల మ్యాపులను జియో రిఫరెన్స్ చేయడం జరిగిందని తెలిపారు. వానాకాలం 2026 సీజన్‌కు సంబంధించి జిల్లాలో వ్యవసాయ ప్లాట్లు డిజిటల్ క్రాప్ సర్వేకు గుర్తించగా, స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా పంటల వివరాలను 88.63 శాతం నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు మార్కెటింగ్, పౌరసరఫరాలు, ఎరువుల నిర్వహణ, విత్తన పంపిణీ, పంటల బీమా, బ్యాంకింగ్, వ్యవసాయ రుణాలు, పిఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ తదితర రంగాలలో అగ్రిస్టాక్ అప్లికేషన్‌ను వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతుల వివరాల ఆధారంగా ఎరువుల బుకింగ్, విక్రయాలు, విత్తనాల పంపిణీ, ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లు, పంటల బీమా, వ్యవసాయ రుణాలు వంటి సేవలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని వివరించారు. అగ్రిస్టాక్ ద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించి రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు కోసం బీజేపీ నమోదు బాట!

- నవంబర్ 6లోగా నమోదు చేసుకోవాలి.. ముక్కు శ్రీనివాస్ రెడ్డి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీజేపీ పినపాక మండల శాఖ నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మండలంలోని వెంకట్రావుపేట, చేగర్శల గ్రామాల్లో బీజేపీ నాయకులు పట్టభద్రులను కలిసి ఓటు నమోదు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కో-కన్వీనర్ ముక్కు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులందరూ నవంబర్ 6వ తేదీలోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఓటు హక్కుకు ప్రాధాన్యత ఉందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పినపాక మండల అధ్యక్షుడు ధూళిపూడి శివప్రసాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ మండల కన్వీనర్ రామకృష్ణ, కో-కన్వీనర్ సతీష్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెరపై పూజ కొత్త లవ్ స్టోరి?

ఫలితం ఏదైనా.. ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా సినిమాల్ని ఎంచుకుంటున్నారు కథానాయిక పూజా హెగ్డే. ప్రస్తుతం 'కాంచన 4' సహా పలు చిత్రాలతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలో 'సంకీ' అనే సినిమా ఉన్న సంగతి తెలిసిందే. పూజ, బాలీవుడ్ కథానాయకుడు అహన్ శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. 'మిషన్ రాణిగంజ్' ఫేమ్ టిను సురేశ్ దేశాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణను శుక్రవారం నుంచి భోపాల్‌లో మొదలు పెట్టాలని చిత్రబృందం నిర్ణయించుకున్నట్లు సమాచారం. ప్రేమ, భావోద్వేగం, యాక్షన్.. లాంటి అంశాల మేళవింపుగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో పూజ, అహన్‌ల మధ్య లవ్‌స్టోరీ, వారి కెమిస్ట్రీ తెరపై ప్రధాన ఆకర్షణగా కనిపించనుందని, వచ్చే ఏడాది ప్రథమార్ధంలో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

రోలర్ కోస్టర్ రైడ్ లాంటి సినిమా

రజత్ రాఘవ్, కాజల్, హాసిని సుధీర్ నాయకానాయికలుగా శరత్ తెరకెక్కించిన చిత్రం 'డాడ్స్ లిటిల్ ఫ్రెండ్'. డి.దీపక్ నిర్మాత. బేబీ పరిణిత రుద్రరాజు కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా నవంబరు 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో టీజర్ విడుదల చేశారు. ఈ వేడుకకు ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పరిణితతో ఈ సినిమా తీసేందుకే దర్శక నిర్మాతలు పుట్టారనిపిస్తోంది. కచ్చితంగా ఆమెకి తెలుగు చిత్ర చరిత్రలో ఓ పేజీ ఉండబోతుంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని.. దీని ద్వారా రజత్‌కి పేరు, డబ్బు అన్నీ వస్తాయని ఆకాంక్షిస్తున్నా" అన్నారు. "తండ్రీ కూతుళ్ల అనుబంధాలతో అల్లుకున్న చిత్రమిది. ఇందులో ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు. ఈ సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుందని నమ్ముతున్నా" అన్నారు దర్శకుడు శరత్. హీరో రజత్ రాఘవ్ మాట్లాడుతూ.. "ఇదొక రోలర్ కోస్టర్ రైడ్ లాంటి సినిమా. కుటుంబ విలువల్ని చాటి చెప్పేలా ఉంటుంది. ప్రతి ఫ్యామిలీకి తప్పక కనెక్ట్ అవుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో దీపక్, రాకేశ్, బేబీ పరిణిత, మాస్టర్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

రివ్యూ: ఆదర్శ కుటుంబం.. వెంకటేశ్- త్రివిక్రమ్‌ల కాంబో మెప్పించిందా?

వెంకటేశ్ – త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబో కోసం సినీప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్రివిక్రమ్ రచయితగా వెంకీతో కలిసి 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' లాంటి మరచిపోలేని వినోదాత్మక చిత్రాల్ని ప్రేక్షకులకు కానుకగా అందించారు. త్రివిక్రమ్ దర్శకుడైనప్పటి నుంచి వెంకటేశ్‌తో మళ్లీ ఎప్పుడు చేతులు కలుపుతారా అని ఫ్యాన్స్ అంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. ఎట్టకేలకు అది 'ఆదర్శ కుటుంబం' రూపంలో కార్యరూపం దాల్చింది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ క్రేజీ సినిమా ఎట్టకేలకు థియేటర్లలోకి వచ్చింది. ఈసారి వెంకీ – త్రివిక్రమ్ క్రైమ్.. డార్క్ కామెడీ జానర్లను టచ్ చేశారు. మరి అది నిజంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచిందా..? అంచనాల్ని అందుకుందా?

కథేంటంటే..

చిట్టిబాబు (వెంకటేశ్) ఓ సాధారణ మధ్యతరగతి బ్యాంక్ ఉద్యోగి. భార్య స్వర్ణ (శ్రీనిధి శెట్టి) చిట్టీల వ్యాపారంలో మోసపోయి కుటుంబాన్ని అప్పులపాలు చేస్తుంది. ఇక చదువబ్బని కొడుకు సర్వ (ప్రజ్వల్).. మెకానిక్‌తో ప్రేమాయణం సాగించే కూతురు సంపూర్ణ (యువీనా) తెచ్చే తలనొప్పులు మరోవైపు. ఇలా అనేక సమస్యలతో సంసారాన్ని భారంగా నెట్టుకొస్తున్న చిట్టిబాబు జీవితాన్ని రూ.100కోట్ల లాటరీ రాత్రికి రాత్రే మార్చేస్తుంది. అంతవరకు ఓ అద్దె ఇంట్లో ఇబ్బందులు పడ్డ తన కుటుంబం ఒక్కసారిగా ఖరీదైన గెటెడ్ కమ్యూనిటీకి మారిపోతుంది. హౌస్ నెం.47 అనే విలాసవంతమైన బంగ్లాలోకి అడుగు పెడుతుంది. అయితే అప్పుడే చిట్టిబాబు ఫ్యామిలీపై అత్యంత కిరాతకమైన బిహార్‌కు చెందిన టార్జన్ దోపిడీ ముఠా కన్నుపడటంతో కథ అనూహ్య మలుపు తిరుగుతుంది. అసలు ఆ టార్జన్ ముఠా నేపథ్యమేంటి? వాళ్లు చిట్టిబాబు కుటుంబాన్ని ఎందుకు లక్ష్యం చేసుకున్నారు. వాళ్ల నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో చిట్టిబాబు కుటుంబం చేసిన సాహసాలేంటి? ఈక్రమంలో ఆ కుటుంబం గురించి పోలీస్ ఆఫీసర్ దామోదర్ నాయుడు (నారా రోహిత్) తెలుసుకున్న నిజమేంటి? టార్జన్ ముఠాని పట్టుకోవడమే లక్ష్యంగా రంగంలోకి దిగిన తన పోలీస్ బృందం చిట్టిబాబు ఫ్యామిలీ వెంట కూడా పడటానికి కారణాలేంటి? ఈ కథలో డీఎస్పీ బృహస్పతి (రావు రమేశ్), ప్రదీప్ సర్కార్ (నాజర్), మాలతి (నివేదా పేతురాజ్), చిత్తరంజన్ (సత్య) పాత్రలకి ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

'మండాడి' దర్శకుడితో.. సూర్య 49?

'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' విజయాలతో జోరుమీదున్నారు కథానాయకుడు సూర్య. ఇప్పుడాయన ఈ దీపావళికి 'సీన్'తో ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఈలోగానే తన తదుపరి కొత్త సినిమా గురించి ఆసక్తికర చర్చ మొదలైంది. సూర్య తన 49వ చిత్రం కోసం 'మండాడి' ఫేమ్ మతిమారన్ పుగళేందితో చేతులు కలపనున్నట్లు సంకేతాలందుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన చర్చలు మొదలయ్యాయని.. మతిమారన్ చెప్పిన స్క్రిప్ట్ నచ్చడంతో సూర్య సానుకూలంగా స్పందించారని సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే కలైపులి ఎస్.థాను నిర్మాణంలో ఈ చిత్రం పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది. ఇక మరోవైపు సూర్య 50వ సినిమాగా 'కరప్పు 2' సెట్స్‌పైకి వెళ్లే అవకాశమున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతానికి ఆయన టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తన 48వ చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు.

శూర్పణఖ పాత్రను కొత్త కోణంలో చూపించబోతున్నాం: రకుల్

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ' . ఇందులో శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా మేకర్స్ ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'జనస్థాన యువరాణి శూర్పణఖ..' అని పేర్కొంటూ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రకుల్.. తన పాత్ర గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"శూర్పణఖ పాత్ర పోషించడం ఎంతో ప్రత్యేకమైన అనుభవం. రామాయణ యుద్ధానికి ప్రధాన కారణాల్లో శూర్పణఖ కూడా ఒకరు. చాలామందికి ఈ విషయం తెలియదు. ఆమెను అందరూ అపార్థం చేసుకున్నారు. ఈ సినిమాలో శూర్పణఖని కొత్త కోణంలో చూపించబోతున్నాం. అలాంటి పాత్రను పోషిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది"

"తరతరాలుగా ప్రజల హృదయాల్లో నిలిచి, మన సంస్కృతిలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈ కథలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నా. ప్రేక్షకులు నా పాత్రను ఎప్పుడు చూస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఈ సినిమాతో భారతీయ చరిత్ర, సంస్కృతిని ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాం. ఇలాంటి భిన్న కోణాలున్న పాత్రలో నటించడం ఆసక్తికరంగా అనిపించింది" ఇక, ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్నారు. సన్నీ దేవోల్ హనుమంతుడి పాత్రలో కనిపించనున్నారు. హన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

అలాంటి వాటిని పట్టించుకుంటే ముందుకెళ్లలేం!

"నా వృత్తిలో నేను చేసే పనిని ఒక సేవగా భావిస్తా. అలాగే చేస్తాను కూడా. బహుశా అందుకేనేమో నా సినిమాలు ప్రేక్షకులకు చేరువయ్యి వారి మెప్పు పొందుతున్నాన"ని అంటున్నారు అందాల తార తమన్నా. వైవిధ్యమైన పాత్రల్లో తనదైన నటనతో అలరిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడల్లా ప్రత్యేక పాటలతో కుర్రకారుని ఉర్రూతలూగించే నాయికీమె. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఈ నాయిక ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన రూపంపై వస్తోన్న వ్యాఖ్యల గురించి మాట్లాడారు. "నా రూపంపై వచ్చే విమర్శలు, సోషల్ మీడియాలో ట్రోల్స్.. లాంటి విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా నా వృత్తిపైనే దృష్టి పెడతాను. ఒక సృజనాత్మక వ్యక్తిగా.. మనం చేయాల్సిన అతి ముఖ్యమైన పని వినడమని అనుకుంటున్నా. విన్న విషయాల్లో దేనిని స్వీకరించాలి.. దేన్ని వదిలేయాలి అనేది అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. పైగా ఒక మహిళగా ఇలాంటి విషయాలకు ప్రాముఖ్యత ఇస్తూ పోతే.. జీవితంలో ముందుకెళ్లలేమనేది తెలుసుకోవాలి. అందుకే నేను విమర్శల వైపు అస్సలు చూడను. నా పని, నేను చేపట్టాలనుకున్న ప్రాజెక్టులే నా ప్రాధాన్యతలు" అని చెప్పుకొచ్చారు తమన్నా.

స్ఫూర్తినిచ్చే 'డియర్ ఆస్ట్రోనాట్'

"ఎవరైనా సరే ఎంత పెద్ద కలైనా కనొచ్చు.. దాన్ని సాకారం చేసుకోవచ్చు అనే గొప్ప సందేశాన్నిచ్చేలా రూపొందిన సినిమా 'డియర్ ఆస్ట్రోనాట్'" అన్నారు దర్శకుడు శేఖర్ కమ్ముల. సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు ప్రధాన పాత్రల్లో కార్తీక్ భాగ్యరాజ తెరకెక్కించిన చిత్రమిది. మనస్విని భాగ్యరాజ నిర్మించారు. గీతా భాస్కర్, చైత్ర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమా నవంబరు 20న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. ఈ వేడుకకి దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఆస్ట్రోనాట్ అవ్వాలనే కోరిక ఉండటం.. దాని చుట్టూ కథని అల్లుకుని సినిమా తీయడం బాగుంది. ఇది చాలా మంచి ప్రయోగం. సాంకేతికంగా ఇది చక్కటి నాణ్యతతో కనిపిస్తోంది. ఇదొక గొప్ప సినిమాగా నిలుస్తుందనే నమ్మకం కలుగుతోంది. దీన్ని అందరూ చూసి.. ఆశీర్వదించాలి" అన్నారు. "అందరికీ స్ఫూర్తినిచ్చే చిత్రమిది. ఓ అమ్మాయి.. వాళ్ల భావోద్వేగాల్ని చూపించే సినిమాగా ఉంటుంది" అన్నారు నటుడు కమల్ కామరాజు. ఈ కార్యక్రమంలో శరణ్య ప్రదీప్, కార్తిక్, గడ్డం వీరు, మార్తాండ్ కె.వెంకటేశ్, గీతా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగాల మైలురాయి

"భావోద్వేగాలతో నిండిన అందమైన ప్రేమకథతో రూపొందిన సినిమా 'మైలురాయి'. ఇది తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు రఘువర్ధన్ కోట్ల. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో జగన్ యోగిరాజు, నవ్య చిట్యాల జంటగా నటించారు. శ్రీహన్సిక పెద్దిరెడ్డి నిర్మించారు. దేవీ ప్రసాద్, లక్ష్మణ్ మీసాల తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే నటుడు – నిర్మాత, ఏపీ శాసనమండలి సభ్యుడు, ఏపీ గ్రీన్ ఛైర్మన్ కొణిదెల నాగబాబు ఈ చిత్ర టైటిల్‌ని ఇటీవల ఆవిష్కరించారు. "ఇదొక మంచి రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా సినిమా. కచ్చితంగా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నా. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు దర్శక నిర్మాతలు.

ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆసుపత్రులలో సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు.

●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలను మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను టెండర్ ప్రక్రియ ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పనులను త్వరితగతిన పూర్తిచేసి జూనియర్ కళాశాలకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు స్వయంగా గణిత పాఠ్యాంశాలను బోధించి, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, రిజిస్టర్లు, పడకలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య, ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రసవాలు చేయించుకోవడానికి గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించి గర్భిణులు ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి, రెవెన్యూ సంబంధిత పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై తహసిల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారిని వివరాలు అడిగి నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జన్నారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న సౌకర్యాలు, భోజన మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థులకు నిర్దేశ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులను పరిశీలించారు. పనులు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నందున మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న భోజనశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు, రోగులకు అందుతున్న చికిత్స, ఆసుపత్రి నిర్వహణను పరిశీలించారు. జిల్లాలో డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల వివరాలను సేకరించి, సంబంధిత ప్రాంతాలలో నీటి నమూనాలను పరీక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వారానికొకసారి / కనీసం నెలకు ఒకసారి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ జి. బక్కయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్ లతో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ రెవెన్యూ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, వివిధ దశలలో ఉన్న ఇండ్ల వివరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జల్సా సీరతున్ నబీ సభ కు పటిష్ట బందోబస్తు కల్పించాలి

మదర్సు మిస్బ ఉల్ ఉలుమ్, ఈద్గా కమిటీ, ఏ జమియత్ ఉలేమా ఏ హింద్ ఆధ్వర్యంలో రేపు దేవరకొండ పట్టణంలోని ఆఖ్సా మస్జిద్ లో శనివారం సాయంత్రం తలపెట్టిన 36 వ, జల్సా సీరతున్ నబీ సభ కు పటిష్ట బందోబస్తు కల్పించాలని శుక్రవారం నగర సీఐ పి వెంకట్ రెడ్డి ని ఈద్గా కమిటీ కోరింది ఈ యొక్క సభ కు ముఖ్య అతిథులు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి మత పెద్దలు, జమియత్ నేతలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ జల్సా కు దేవరకొండ నియోజకవర్గం పరిసరాల నుండి 3 నుండి నాలుగు వేల మంది ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సభ సజావుగా సాగేందుకు పటిష్ట బందోబస్తు కల్పించాలని ఈ సందర్భంగా కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ ప్రధాన కార్యదర్శి యండి ఇలియాస్ పటేల్, ఉపాధ్యక్షులు యం ఏ సాలర్ ఖదీర్, యండి సలీమ్, ఖాజా మైనొద్దీన్, సయ్యద్ దస్తగిర్, యం ఏ ఖాలేఖ్, ఎస్ కె ఇల్యాస్ బాబా, తదితరులు ఉన్నారు

ఆంధ్రప్రదేశ్ కి మిర్యాలగూడ డివిజన్ విద్యుత్ సహాయక బృందాలు..

ఆంధ్రప్రదేశ్ లో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు తెలంగాణ విద్యుత్ సంస్థ సహాయక బృందాలను పంపింది,టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జితేష్ పాటిల్,ఐఎఎస్ ఆదేశాల మేరకు నల్లగొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ డివిజన్ నుండి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు,తుఫాన్ కారణంగా ఏపీలోని తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి,కృష్ణా జిల్లాలలో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి,పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి ప్రత్యేక వాహనాలు,అత్యాధునిక బ్యాటరీ క్రేన్లు ప్రూనర్లు,అత్యవసర పరికరాలతో మిర్యాలగూడ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బయలుదేరారు,ఉన్నతాధికారులు జెండా ఊపి బృందాల వాహనాలను ప్రారంభించారు.ఇట్టి కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆచారి,డివిజన్ ఏడీఈలు తిరుపతయ్య,కోడిరెక్క రవికుమార్,ఇందిరా,ఏఈలు వినోద్ కుమార్,రవీందర్ రెడ్డి,వెంకట్ రెడ్డి,జానయ్య,కృష్ణారెడ్డి,సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్లు మారం శ్రీనివాస్,వీరభద్రం,ఎల్లయ్య చారి,విక్రం,జలంధర్,భాస్కర్,సతీష్, వెంకటరత్నం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాకలో ఏడాది గడిచిన పూర్తికాని పంచాయతీ భవనం...?

●- నిధుల కొరతా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా...?

●- అర్ధాంతరంగా నిలిచిన పనులు పూర్తి చేయాలని గ్రామస్థుల డిమాండ్...!

గ్రామస్థాయి పరిపాలనకు కేంద్రబిందువుగా ఉండాల్సిన గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఉప్పాక గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల పరిధిలోని ఉప్పాక గ్రామపంచాయతీలో నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా నేటికీ పూర్తికాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎంతో ఆశతో ప్రారంభించిన పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో గ్రామ పరిపాలనకు సొంత కార్యాలయం లేకుండా పోయింది.గ్రామపంచాయతీ కార్యాలయం అందుబాటులో లేకపోవడంతో సర్పంచ్, పంచాయతీ సిబ్బంది పరిపాలనాపరమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ప్రజల సమస్యలపై సమావేశాలు నిర్వహించడం, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవలు అందించడం, ఇతర పరిపాలనా కార్యక్రమాలు చేపట్టడంలో తాత్కాలిక వసతులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కార్యాలయం నిర్మాణం పూర్తికాకపోవడంతో పాలనా సేవలపై ప్రభావం పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నిలిచిన పనులు.. నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఏమిటో...?

భవన నిర్మాణ పనులు ఏ కారణంతో నిలిచిపోయాయన్నది ఇప్పటికీ స్పష్టత లేకుండా పోయిందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. నిధుల కొరత కారణమా? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? లేక సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణానికి ఎంత మొత్తం నిధులు మంజూరయ్యాయి? ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? ఇంకా ఎన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది? అనే వివరాలను అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు. పనులు నిలిచిపోయినా సంబంధిత శాఖల నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలి.

గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందాలంటే సొంత పంచాయతీ కార్యాలయం అత్యవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్, ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖల అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించి నిర్ణీత గడువులోగా భవనాన్ని పూర్తి చేసి గ్రామపంచాయతీకి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే గ్రామస్థులంతా ఏకమై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

- కార్యాలయం లేక పాలనకు ఇబ్బందులు : సర్పంచ్ మట్ట బాబూరావు.

గ్రామ ప్రజలకు సంబంధించిన సమస్యలపై చర్చించడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలు, ఇతర పంచాయతీ పరిపాలనా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాలయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవనం అందుబాటులో లేకపోవడంతో ప్రతి కార్యక్రమానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ మట్ట బాబూరావు కోరారు. గ్రామ పరిపాలన సజావుగా సాగేందుకు నూతన పంచాయతీ కార్యాలయ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి,

●మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,

ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని, కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయంలో వివిధ రెవెన్యూ అంశాలకు సంబంధించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ జి.ఓ. నం.76, 59, ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ, భూ భారతి క్రింద పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, మీ-సేవ ద్వారా జారీ చేయవలసిన వివిధ ధ్రువపత్రాల దరఖాస్తుల పరిష్కార స్థితిగతులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశించిన కాలపరిమితి లోగా పూర్తి చేయాలని సూచించారు. భూ భారతి, ప్రభుత్వ ఉత్తర్వులకు సంబంధించిన ఫైళ్లతో పాటు మీ-సేవ ద్వారా జారీ చేయవలసిన పెండింగ్ ధ్రువపత్రాల దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా చూడాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ ఫైళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ విధులలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డి.ఎం నేడు

టి.జి.ఎస్ ఆర్.టి.సి రాణిగంజ్ డిపో పరిధిలో తేదీ 31-10-2026 శనివారం నాడు డయల్ యువర్ డి.ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాణిగంజ్ డిపో మేనేజర్ రవీందర్ గారు తెలిపారు రాణిగంజ్ డిపో పరిధిలో ఉన్న సర్వీసులపై అవగాహన మరియు కొత్త సర్వీసుల పునరుద్ధరణ ప్రయాణికులకు ఆర్.టి.సి వల్ల జరిగే ప్రయోజనాలు పెళ్లి మరియు శుభకార్యాలకు బస్సు బుక్ చేసుకోవడం కొరకు మరియు ప్రజల వారి సమస్యలపై సూచనలు సలహాలు తెలియజేయాలని కోరారు మధ్యాహ్నం 15:00 గంటల నుండి 16:00 గంటల వరకు ఫోన్ నెంబర్ కు ఫోన్ 9959226147 చేయగలరని సూచించారు

వైద్యం పేరుతో పేషెంట్ల వద్ద నుండి విచ్చలవిడిగా అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేక నిఘాఉంచి ప్రభుత్వా లుప్రజలను ఆదుకోవాలి.

అంతంతమాత్రమేఆదాయాల తోఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ భారమవుతున్న ప్రస్తుత పరిస్థితులను అధిగమించడానికి బడుగు బలహీనవర్గాలు, మధ్యతరగతి పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ప్రస్తుత సమాజంలో ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడలేక ప్రజలు సతమతమవుతున్నారు.

కరోనా మొదలగు ప్రకృతి వైపరీత్యాలతో ప్రజలు అనేకఇబ్బం దులకు గురైన సంగతి తెలిసినదే, సుమారు సంవత్సర కాలంగా ఎల్ ని నో ప్రభావం తో అతివృష్టి అనావృష్టిలమధ్య, పెరుగుతున్న నిత్యావసర సరుకులను అధిక ధరలు పెట్టి కొనలేక మధ్యతరగతి ప్రజలు ఉసూరు మంటున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, తుఫాన్, ఎల్ ని నో ప్రభావంతో కరువు రానున్నదని భయభ్రాంతులవుతున్నప్రజల పైగొరుచుట్టపై రోకలిపోటు తగిలినట్లుగా, సీజనల్ వ్యాధులు, ఇతర వ్యాధులతో ప్రైవేట్ఆస్పత్రులకు వెళుతున్న రోగుల వద్దనుండి అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ వైద్యుల బండారం అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ హెచ్చరికలతో రోగుల వద్ద నుండి ప్రైవేట్ ఆస్పత్రులు చేస్తున్న నిలువుదోపిడీ బహిర్గతమయింది.

11 వేల రూపాయలు విలువ చేసే ఒక ఇంజక్షన్ ను 1 లక్ష 30 వేల రూపాయలు రోగి వద్ద నుండి వసూలు చేయడంతో ప్రైవేట్ వైద్యుల బండారం బహిర్గతమయ్యింది.

విద్య, వైద్యం కోసం అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు సంబంధిత సంస్థలు వసూలు చేస్తున్న ఫీజులు చెల్లించలేక తమ ఇబ్బందులు పట్టించుకునే నాథుడు లేక బడుగు బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు తమ సమస్యలు తీర్చే వారు లేక భగవంతుడిపై భారం వేసి తమ సమస్యలు తీరక జాతస్య మరణం ధ్రువం అనే పరిస్థితులకు చేరుతున్నారు.

ప్రభుత్వాలు ప్రజలందరికి ఉచితంగా విద్య, వైద్యం అందించ లేక పోయినప్పటికీ ఆయాసంస్థలలో ప్రజల వద్ద నుండి చేస్తున్న నిలువు దోపిడీని అరికట్టే అవకాశం ప్రభుత్వాలకు ఉంటుంది.

వైద్యానికి ఉపయోగించే మందులు అతి తక్కువ రేట్లతో ఉత్పత్తి అవుతున్న విషయం జగమెరిగిన సత్యమే, లిక్కర్ షాపుల కంటే అధిక లాభాలు మెడికల్ షాపుల కు వస్తున్న విషయం తెలిసిన విషయమే మెడికల్ షాపులలో అమ్ముతున్న మందులు ఎమ్మార్పీ రేట్లకు 25 శాతం తగ్గించి అమ్మినా, మెడికల్ షాపులకు ఆదాయం బాగానే ఉంటుంది. ఈకారణం గానే తమ మందులు రిఫర్ చేసే డాక్టర్లకు, అమ్ముతున్నమెడికల్ షాపుల వారికి విదేశీ ప్రయాణాలు, లక్షలాది రూపాయల పారితోషికాలు మందుల ఉత్పత్తి సంస్థల వారు సమర్పిస్తుంటారు. ఈభారాన్నంతా అధిక ధరలకు మందులు కొనుగోలు చేసే రోగుల రూపంలో ఉన్న ప్రజలు భరించాల్సి వస్తోంది.

కోట్లాదిమంది ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న ఈవిషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి తమ ప్రభుత్వా ఏర్పాటుకు కారణమైన ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా విద్య, వైద్యం,మద్యం ద్వారా అధిక ఆదాయాలు పొందుతున్న సంస్థలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి అధిక (ధరలు) ఫీజులు వసూలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోట్లాదిమంది ప్రజలు

పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ధన్యవాదములు

బిజెపి మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధులను విడుదల చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ పథకం ద్వారా అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా రూ.2,000 చొప్పున ఆర్థిక సహాయం జమ చేయడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.రైతుల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , కేంద్ర ప్రభుత్వానికి రైతుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు...

రైతులకు నీళ్లు ఇవ్వని బీఆర్ఎస్.. ఆదిలాబాద్‌లో ఏ ముఖం పెట్టుకుని గర్జన సభ పెడుతుంది?: కల్వకుంట్ల కవిత

పంటలు వేయవద్దన్న ముఖ్యమంత్రి అధికారంలో ఉండేందుకు అర్హుడు కాదులిలి
చనఖా--కొరటా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.368 కోట్ల నుంచి రూ.2,100 కోట్లకు పెంపుపై సమాధానం చెప్పాలి
సామాజిక న్యాయాన్ని మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

ఆదిలాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రైతులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు రైతు గర్జన సభ నిర్వహించడం విడ్డూరంగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వని బీఆర్ఎస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని సభ నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇంద్రవెల్లిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి అమరవీరులకు, కొమురం భీమ్, రామ్‌జీ గోండు తదితర పోరాట యోధులకు నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ఇంద్రవెల్లి గడ్డకు పాదాభివందనం చేశారు. అధికారంలోకి వస్తే ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికీ పేదరికం, నిరుద్యోగం, విద్యా, వైద్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కవిత పేర్కొన్నారు. సుమారు 750 గ్రామాల్లో పాఠశాలలు లేకపోవడం బాధాకరమన్నారు. తుమ్మిడిహెట్టి, కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని తెలిపారు. రైతులను పంటలు వేయవద్దని సూచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ప్రత్యామ్నాయ భరోసా ఏమిస్తారని ప్రశ్నించారు. చనఖా--కొరటా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.368 కోట్ల నుంచి రూ.2,100 కోట్లకు పెంచడంపై బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పెంపు వెనుక భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయో వెల్లడించాలని కోరారు. సింగరేణి, సీసీఐ, చక్కెర పరిశ్రమల పునరుద్ధరణలోనూ గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రకటించిన పాంచజన్య సంకల్పంలో ఐదు ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ రంగంలోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం అందించేలా కృషి చేస్తామని, యువతకు వారి ఆలోచనలకు అనుగుణంగా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు వ్యాపార రుణాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీల హక్కులను కాపాడటంతో పాటు ఐటీడీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 27 జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఆదిలాబాద్ ప్రజల ఆశలను నెరవేర్చలేదని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు తమ పాలనలో జిల్లాకు యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల ఎందుకు తీసుకురాలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రైతులకు సాగునీరు అందించకుండా రైతు గర్జన పేరుతో సభలు నిర్వహించడం సరికాదన్నారు. సామాజిక న్యాయం మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నామని పేర్కొన్న కవిత, రెండు ఎమ్మెల్సీ స్థానాలకు బీసీ యువకులు శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్‌లను అభ్యర్థులుగా ప్రకటించినట్లు తెలిపారు. రాజకీయ నేపథ్యం, ఆర్థిక బలం లేని యువతకు అవకాశాలు కల్పించడం ద్వారా రాజకీయాల్లో మార్పు తీసుకురావచ్చన్నారు. ఆదివాసీలు, ఆదిలాబాద్ జిల్లా ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసి, జిల్లాలో అన్ని స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కవిత విజ్ఞప్తి చేశారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు ప్రత్యేక తపాలా బిళ్లలు

ప్రారంభ దశలో గుర్తింపు.. సకాలంలో చికిత్స ప్రాధాన్యాన్ని చాటిన తపాలా శాఖ

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ పరిధిలోని తపాలా శాఖ ప్రత్యేక స్మారక తపాలా బిళ్లలను విడుదల చేసింది. రెండు స్మారక తపాలా బిళ్లలతో రూపొందించిన ప్రత్యేక సావనీర్ షీట్‌ను న్యూఢిల్లీలోని డాక్ భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. తపాలా సేవల డైరెక్టర్ జనరల్ మనీషా సిన్హా, కేంద్ర ఆరోగ్య--కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవతోపాటు రెండు శాఖల ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనీషా సిన్హా మాట్లాడుతూ.. దేశ ప్రాధాన్యాలను ప్రతిబింబించడంతోపాటు భౌగోళిక సరిహద్దులకు అతీతంగా అవగాహన సందేశాలను చేరవేయడంలో స్మారక తపాలా బిళ్లలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, ప్రారంభ దశలోనే గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. మహిళలు సకాలంలో వైద్య సలహా పొందేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని సూచించారు. చికిత్స పొందుతున్న మహిళలకు ఆత్మీయత, ప్రోత్సాహం, భావోద్వేగ మద్దతును అందించేందుకు పోస్టుకార్డులు కూడా ఉపయోగకరమైన మాధ్యమంగా నిలవగలవని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య సందేశాన్ని తపాలా బిళ్లల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్న తపాలా శాఖను పుణ్య సలిల శ్రీవాస్తవ అభినందించారు. వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల స్క్రీనింగ్ జాతీయ ఆరోగ్య కార్యక్రమంలో అంతర్భాగమని తెలిపారు. ముందస్తు గుర్తింపు కోసం మహిళలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకునేలా అవగాహన పెంచాల్సిన అవసరముందన్నారు. భారత్‌లో మహిళలకు వచ్చే క్యాన్సర్లలో రొమ్ము క్యాన్సర్ అత్యంత సాధారణమైనదని, ఏటా సుమారు రెండు లక్షల కొత్త కేసులు నిర్ధారణ అవుతున్నాయని ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. అసంక్రమిత వ్యాధుల నివారణ, నియంత్రణ జాతీయ కార్యక్రమం కింద జనాభా ఆధారిత స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు చర్యలను ప్రభుత్వం బలోపేతం చేస్తున్నట్లు వివరించింది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపింది. అవసరమైన వారికి తదుపరి వైద్య పరీక్షల కోసం రిఫరల్ సదుపాయంతోపాటు జిల్లా, ఉన్నతస్థాయి ఆసుపత్రుల్లో చికిత్స అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు ఫోర్టిస్ ఆసుపత్రి సహకారంతో డాక్ భవన్‌లో తపాలా శాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహనతోపాటు ప్రాథమిక ప్రాణరక్షణ సహాయం (బీఎల్ఎస్), కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) పద్ధతులపై పరస్పర చర్చా కార్యక్రమాలు చేపట్టింది. వ్యాధి నివారణపై అవగాహన, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే నైపుణ్యాలపై పరిజ్ఞానం పెంపొందించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని తెలిపింది.

పరిశుభ్రత.. పరిపాలనా సామర్థ్యమే లక్ష్యంగా ప్రత్యేక ఉద్యమం

స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ పురోగతి
4,052 ఈ--ఫైళ్ల సమీక్ష.. 1,160 చదరపు అడుగుల కార్యాలయ స్థలం అందుబాటులోకి

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: కార్యాలయాల్లో పరిశుభ్రతను పెంపొందించడం, స్థలాన్ని సమర్థంగా వినియోగించడం, పెండింగ్ అంశాలను సకాలంలో పరిష్కరించడం లక్ష్యంగా ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎండోనేర్), దాని అనుబంధ సంస్థలు ప్రత్యేక ప్రచార కార్యక్రమం 6.0ను అమలు చేస్తున్నాయి. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రికార్డుల నిర్వహణ, పరిపాలనా సామర్థ్యం మెరుగుదలకు ప్రాధాన్యమిస్తున్నాయి.
అక్టోబర్ 30 నాటికి మంత్రిత్వ శాఖ, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మొత్తం 11 పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. సమీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్న 5,650 ఈ--ఫైళ్లలో 4,052 ఫైళ్లను పరిశీలించారు. కార్యాలయ స్థల వినియోగాన్ని క్రమబద్ధీకరించడం ద్వారా 1,160 చదరపు అడుగుల స్థలాన్ని ఇతర అవసరాలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమ పురోగతి, సాధించిన ఫలితాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.
పెండింగ్ అంశాల పరిష్కారంలోనూ పురోగతి సాధించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. పార్లమెంట్ సభ్యుల నుంచి అందిన ఆరు నివేదనల్లో నాలుగింటిని పరిష్కరించారు. అంతర్ మంత్రిత్వ శాఖల కమిటీకి సంబంధించిన మూడు అంశాలతోపాటు అందిన మూడు ప్రజా ఫిర్యాదులను పూర్తిగా పరిష్కరించినట్లు వెల్లడించింది.
పరిశుభ్రత కార్యక్రమాలు, పని బల్లలను శుభ్రంగా ఉంచే 'క్లీన్ డెస్క్' కార్యక్రమం, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ఈ--ఫైళ్ల సమీక్ష, ముగింపుపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొంది. నిరుపయోగ వస్తువులు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపు, కార్యాలయ స్థలాన్ని సమర్థంగా వినియోగించడం, పెండింగ్ నివేదనలను నిర్ణీత గడువులో పరిష్కరించడం వంటి చర్యలను కొనసాగిస్తున్నట్లు వివరించింది.
ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో సాధించిన పురోగతిని కొనసాగిస్తూ.. పరిశుభ్రత, సమర్థ రికార్డుల నిర్వహణ, పరిపాలనా సామర్థ్యాన్ని రోజువారీ కార్యాలయ పనితీరులో అంతర్భాగంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

వికసిత భారత్ లక్ష్యంగా బ్యాంకింగ్ సంస్కరణలకు ఉన్నతస్థాయి కమిటీ

మాజీ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ సురేశ్ ఎన్. పటేల్‌కు సారథ్యం
ఆరు నెలల పదవీకాలం.. బ్యాంకింగ్ రంగ సమగ్ర సమీక్షకు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
వికసిత భారత్--2047 లక్ష్యాలకు అనుగుణంగా దేశ బ్యాంకింగ్ రంగాన్ని తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం 'వికసిత భారత్ కోసం బ్యాంకింగ్‌పై ఉన్నతస్థాయి కమిటీ'ని ఏర్పాటు చేసింది. బ్యాంకింగ్ వ్యవస్థను అంతర్జాతీయంగా పోటీపడగలిగేలా, ఆర్థిక సేవలు అందరికీ చేరువయ్యేలా, సంక్షోభాలను తట్టుకునేలా బలోపేతం చేసేందుకు అవసరమైన సంస్కరణలను ఈ కమిటీ సిఫార్సు చేయనుంది.
నిర్మాణాత్మక, సంస్థాగత, నియంత్రణ, చట్టపరమైన మార్పులపై కమిటీ సమగ్ర సమీక్ష చేపట్టనుంది. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026--27 బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.
కమిటీ చైర్మన్‌గా మాజీ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ సురేశ్ ఎన్. పటేల్ వ్యవహరించనున్నారు. భారతీయ రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ శిరీష్ చంద్ర ముర్ము, ఇండియన్ బ్యాంక్ మాజీ ఎండీ, సీఈఓ పద్మజ చుండూరు, ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ ఎన్.ఎస్. విశ్వనాథన్ సభ్యులుగా నియమితులయ్యారు. ఆర్థిక సేవల విభాగం సంయుక్త కార్యదర్శి (బ్యాంకింగ్) సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. కమిటీ పదవీకాలం ఆరు నెలలుగా నిర్ణయించారు.

ప్రపంచస్థాయి బ్యాంకుల అభివృద్ధికి మార్గసూచీ
ప్రస్తుత బ్యాంకింగ్ విధానాలు, ఆర్థిక పటిష్ఠతకు సంబంధించిన ప్రమాణాలను కమిటీ పరిశీలించనుంది. అంతర్జాతీయ ఉత్తమ విధానాలను గుర్తించి భారత బ్యాంకింగ్ వ్యవస్థకు అనుగుణంగా అమలు చేసేందుకు సూచనలు ఇవ్వనుంది. ప్రపంచస్థాయిలో పోటీపడగల బ్యాంకులను అభివృద్ధి చేసేందుకు మార్గసూచీ రూపొందించనుంది.
ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులతో సహా బ్యాంకులకు వర్తించే నియంత్రణ, చట్టపరమైన వ్యవస్థలను సమీక్షించనుంది. సామర్థ్యాన్ని పెంపొందించడం, బ్యాంకింగ్ లావాదేవీలు, సేవలను మరింత సులభతరం చేయడం లక్ష్యంగా సంస్కరణలను ప్రతిపాదించనుంది.

మూలధన అవసరాలు.. ప్రైవేటు పెట్టుబడులపై దృష్టి
బ్యాంకులు, అభివృద్ధి ఆర్థిక సంస్థలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల దీర్ఘకాలిక మూలధన అవసరాలను అంచనా వేయడం కమిటీ బాధ్యతల్లో భాగంగా ఉంది. రుణాల విస్తరణకు అవసరమైన నిధుల వనరులు, సహాయక వ్యవస్థలపై సిఫార్సులు చేయనుంది. వ్యాపారాలకు మూలధన సమీకరణ వ్యయంలో ఉన్న తేడాలను పరిశీలించి, సుస్థిర వృద్ధికి దోహదపడే ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలను సూచించనుంది.

ఏఐ, డిజిటల్ ఆవిష్కరణలకు ప్రణాళిక
బ్యాంకింగ్ సంస్థల్లో కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ ఆవిష్కరణల వినియోగానికి కమిటీ మార్గసూచీ సిద్ధం చేయనుంది. సైబర్ ముప్పుల నుంచి రక్షణకు అవసరమైన చర్యలను సూచించనుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సిబ్బందిని తీర్చిదిద్దేందుకు ప్రతిభావంతుల నియామకం, నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య పెంపుపై వ్యూహాన్ని ప్రతిపాదించనుంది.
ప్రాధాన్య రంగ రుణాల విధానం, లీడ్ బ్యాంక్ పథకం ప్రస్తుత అవసరాలకు ఎంతవరకు అనుగుణంగా ఉన్నాయో కూడా సమీక్షించనుంది. సమ్మిళిత, సమతుల్య అభివృద్ధికి తోడ్పడేలా, గణాంకాల ఆధారంగా రుణాలు అందించడంలో వాటి ప్రభావం, సమన్వయాన్ని పరిశీలించనుంది. మారుతున్న ఆర్థిక ప్రాధాన్యాలు, ఆర్థిక సమ్మిళిత లక్ష్యాలకు అనుగుణంగా సూచనలు ఇవ్వడంతోపాటు కేంద్ర ప్రభుత్వం అప్పగించే ఇతర అంశాలపైనా కమిటీ సిఫార్సులు చేయనుంది.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు

విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు
71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి చెల్లించే కరువు భత్యం (డీఏ), కరువు ఉపశమనం (డీఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది.
కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

సంస్థల వారీగా లబ్ధిదారులు ఇలా..
టీజీ ట్రాన్స్‌కో పరిధిలో 3,081 మంది ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. టీజీ జెన్‌కోలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. టీజీ ఎస్పీడీసీఎల్‌లో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, టీజీ ఎన్పీడీసీఎల్‌లో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, విద్యుత్ సంస్థల సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగానే ఈ డీఏ, డీఆర్ పెంచాలని ఆదేశాలు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

చేవెళ్లలో ఫామ్‌హౌస్ పార్టీపై ఎస్ఓటీ పోలీసుల దాడి.. 25 మంది విద్యార్థులు అదుపులోకి

ఎల్జీ ఫామ్‌హౌస్‌లో విద్యార్థుల పార్టీ భగ్నం.. భారీగా మద్యం బాటిళ్లు స్వాధీనంలిలి

చేవెళ్ల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని కమ్మెట గ్రామ సమీపంలో ఉన్న ఎల్జీ ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న పార్టీపై ఎస్ఓటీ పోలీసులు, స్థానిక చేవెళ్ల పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ పార్టీలో ఐబీఎస్ ఇఫ్కాయ్ యూనివర్సిటీకి చెందిన బీబీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నట్లు సమాచారం.
పార్టీ జరుగుతున్న సమయంలో పోలీసులు ఆకస్మికంగా దాడి చేయడంతో విద్యార్థులు పరుగులు తీశారు. సుమారు 25 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పార్టీలో 20 నుంచి 25 మంది వరకు విద్యార్థినులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఫామ్‌హౌస్‌లో భారీగా మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న విద్యార్థులకు డ్రగ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఫామ్‌హౌస్‌లో పార్టీ నిర్వహణ, మద్యం వినియోగం, డ్రగ్స్‌కు సంబంధించిన అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. డ్రగ్ టెస్టుల ఫలితాలు, పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ప్రతి గ్రామపంచాయతీకి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక

ప్రతి గ్రామానికి ప్రత్యేక ప్రొఫైల్.. ఐదేళ్ల అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ
మంత్రి సీతక్క ఆలోచనతో
జీపీసాప్ -2026 రూపకల్పన

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
తెలంగాణలోని ప్రతి గ్రామపంచాయతీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా ప్రతి గ్రామపంచాయతీకి సమగ్ర గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీసాప్-2026) రూపొందిస్తోంది. మంత్రి సీతక్క ఆలోచన, ఆదేశాల మేరకు ఈ ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి ప్రత్యేక ప్రొఫైల్ తయారు చేయనున్నారు. గ్రామ జనాభా, కుటుంబాల స్థితిగతులు, ఉపాధి, గృహవసతి, పశుసంపద, ప్రభుత్వ పథకాల అమలు వంటి వివరాలను పొందుపరుస్తారు. వీటి ఆధారంగా రాబోయే మూడు నుంచి ఐదేళ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించడంతో పాటు ప్రస్తుత ఏడాదికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తారు.
గ్రామాల అవసరాలు, ప్రాధాన్యతలను బట్టి అభివృద్ధి పనులను ఎంపిక చేసి వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అమలు చేయనున్నారు. ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేయడంతో పాటు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డాష్‌బోర్డు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి నెలా జరిగే గ్రామపంచాయతీ సమావేశంలో ఊూ్రూ అమలుపై సమీక్ష నిర్వహిస్తారు. పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు అధికారులకు బాధ్యతలు అప్పగించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించనున్నారు. సమాచారాన్ని అందించని, తప్పుడు వివరాలు ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి చేయడం, పారదర్శకతతో కూడిన పాలన అందించడం, అధికారుల్లో జవాబుదారీతనం పెంచడం జీపీసాప్-2026 ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ ప్రణాళిక అమలుతో గ్రామాల అవసరాలకు అనుగుణంగా నిధులు, అభివృద్ధి పనుల

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

భావ కవితా యుగ కర్త దేవులపల్లి కృష్ణ శాస్త్రి

హైదరాబాద్ , చిక్కడపల్లి , త్రైనెట్ న్యూస్, అక్టోబరు 30:
గురజాడ అప్పారావు అభ్యుదయ సాహితీ యుగ కార్త కాగా రాయప్రోలు సుబ్బారావు భావ కవిత్వ యుగ కర్త ఆయనను అనుసరించి కొనసాగించిన వారు దేవులపల్లి కృష్ణ శాస్త్రి అని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ నాయుడు సత్యనారాయణ చెప్పారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా దేవులపల్లి కృష్ణ శాస్త్రి జయంతి సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ దేవులపల్లి కృష్ణ శాస్త్రి కృష్ణ పక్షం కావ్యం భావ కవిత్వం ను పతాక స్థాయి లో నిలిపింది అని వివరించారు మహా కవి శ్రీ శ్రీ ప్రజల బాధ తన బాధ గా సాహిత్య రచన చేస్తే దేవులపల్లి తన బాధ ప్రజల బాధగా ప్రేమ విరహం అంశాలు గా రచన చేశారని ప్రముఖ సాహితీ వేత్త చలం చెప్పిన మాటలు గుర్తు చేశారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ కృష్ణ శాస్త్రి సినీ పాటలు సాహిత్య గుబాళింపు లనీ ముఖ్యం గా జయ జయ భారత జానయత్రీ, ఆకులో ఆకునై వంటి గీతలు ఎవర్ గ్రీన్ అని చెప్పారు
సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు గాయకుడు సుబ్రహ్మణ్యం గాయని రత్న మాల పాల్గొన్నారు

త్రైనెట్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...

"భారతీయ విజ్ఞానం"....
ప్రపంచంలో సృష్టి మీద ఎందరో రకరకాలుగా అర్థం చేసుకున్నారు .అయితే ఒక్క హిందువులకు మాత్రమే
శాస్త్రీయపరమైన సృష్టి అవగాహన ఉన్నది. మత్స్య, కూర్మ ,విష్ణు ,బ్రహ్మ మరియు భాగవత పురాణాలలో ఈ విషయం పొందుపరచబడి ఉన్నది.
సృష్టికి ఆరంభం అంతం ఉండవని ఋషులు కనుగొన్నారు .ఇది ఒక చక్రంలా సాగుతుంది. వారు ఒక అద్భుతమైన శక్తి ఈ విశ్వసృష్టికి మూలం అని, దాన్నే "ఆదిశక్తి" అని పిలిచారు.
బ్రహ్మదేవుని ఒక పగలును కల్పమంటారు ఈ కల్పంలో సృష్టి జరుగుతుంది. బ్రహ్మదేవుని రాత్రి సమయంలో విశ్వం మొత్తం లయమై తిరిగి బ్రహ్మలో కలిసిపోతుంది. దీనినే ప్రళయం అని అంటారు.
ప్రతి కల్పనలోనూ చతుర్యుగాలు కృత, త్రేతా ,ద్వాపర, కలి యుగాలు. ఇవి పునరావృతం అవుతూనే ఉంటాయి.
విశ్వం మొత్తం సృష్టి, స్థితి, లయ అనే మూడు దశలలో కొనసాగుతున్నది. ఆ మూడు దశలను త్రిమూర్తులుగా గుర్తించారు. ఇందులో బ్రహ్మ సృష్టి కారకుడు .విష్ణువు స్థితికారకుడు .శివుడు లయకారకుడు.
బ్రహ్మ: బ్రహ్మ ఆవిర్భావం:
విశ్వసష్టి సిద్ధాంతంలో బ్రహ్మాండం
స్త్రశీశ్రీనవఅ వస్త్రస్త్ర అనే భావనకు చాలా ప్రాధాన్యత ఉంది సృష్టికి పూర్వం విశ్వమంతా గాఢాంధకారంతో శూన్యంతో నిండి ఉంది.
అప్పుడు నీరు సృష్టించబడింది అందులో ఒక బీజం బంగారు అండంగా మారింది. దానినే హిరణ్య గర్భం అంటారు. ఆ అండం రెండు భాగాలుగా విభజింపబడి ఒక భాగం ఆకాశంగాను రెండవ భాగం భూమిగాను ఏర్పడ్డాయి ఆ అండం నుండే బ్రహ్మదేవుడు ఆవిర్భవించి సృష్టి కార్యాన్ని ప్రారంభించాడు.
జీవరాశికి మూలమై నాలుగు దిశలుగా వ్యాపించి ఉన్న ప్రకృతినే బ్రహ్మ అంటారు. బ్రహ్మను స్వయంభూ అని కొందరు అంటారు. ప్రళయకాలంలో శ్రీమహావిష్ణువు క్షీరసాగరంపై, శేషతల్పం పై శయనించి ఉన్నప్పుడు ఆయన నాభి నుండి ఒక పద్మం ఉద్భవించిందని ,ఆ పద్మం నుండి బ్రహ్మదేవుడు ఆవిర్భవించాడని కూడా అంటారు. అందుకే ఆయనను పద్మభవుడు అని పిలుస్తారు.
బ్రహ్మదేవునికి నాలుగు ముఖాలు ఉంటాయి ఇవి నాలుగు వేదాలు

అనగా ఋగ్వేదం ,యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం మరియు నాలుగు దిక్కులకు ప్రతీకలు.
ఆయన నాలుగు చేతులు మనసు, బుద్ధి ,అహంకారం, చిత్తం అనే నాలుగు అంతఃకరణాలను సూచిస్తాయి.అంతఃకరణాలు అనగా మనస్తత్వాలు అని అర్థం.
బ్రహ్మ చేతిలోని వస్తువులు.... ఒక చేతిలో సృష్టి జ్ఞానాన్ని తెలిపే వేద గ్రంథం, మరొక చేతిలో కాలానికి ప్రతీకైన జపమాల ,మరొక చేతిలో సృష్టికి కారణమైన నీరు ఉండే కమండలం ,నాలుగోచేతిలో యజ్ఞాన్ని సూచించే స్రుక్కు(కుశధార) ఉంటాయి.స్రుక్కు అంటే యజ్ఞం సమయంలో వాడే గరిట. అది బ్రహ్మ చేతిలో ఎందుకు ఉంటుందంటే సృష్టిలో బ్రహ్మయే మొదటి యజ్ఞకర్త.
సృష్టిని సృష్టించే క్రమంలో బ్రహ్మ తన సంకల్పం ద్వారా మరీచి, అత్రి ,అంగీరసుడు, నారదుడు, దక్షుడు వశిష్ఠుడు, భృగువు, పులస్త్యుడు , పులహుడు, క్రతువు, వంటి ప్రజాపతులను, సనత్కుమారులను మరియు సమస్త జీవకోటిని సృష్టించాడు. వీరిని బ్రహ్మ మానస పుత్రులు అని అంటారు.
తరువాత మానవ సృష్టి కోసం ఆయన తన శరీరాన్ని రెండు భాగాలుగా చేసి స్వాయంభువ మనువు (మొదటి పురుషుడు) శతరూప (మొదటి స్త్రీ) లను సృష్టించాడు. వీరి నుండి మానవ వంశం ప్రారంభమైంది అంటారు.(ఇంకా ఉంది)
శుభోదయం..... శశిబాల

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు వేగవంతం చేయండి

నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వండి
అనంతారంలో మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి
రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సీఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.
కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. వికారాబాద్ -- కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని సీఎం కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (===) పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్– గద్వాల్, కల్వకుర్తి -- మాచర్ల, కాచిగూడ కాచిగూడ --జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు -- ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ -- లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

ఆపరేషనల్ మాక్ డ్రిల్

హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 30:
తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఆక్టోపస్ (ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్) బృందం ఆధ్వర్యంలో, ఆక్టోపస్ ఎకో స్వాత్ టీమ్ ఎస్ఓసీ/డీఎస్పీ బి. దాసు నాయకత్వంలో వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషనల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ పోలీస్, అగ్నిమాపక శాఖ, సీఎస్జీ , తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్), ట్రాఫిక్ పోలీస్, వైద్య బృందం, బాంబ్ డిస్పోజల్ (బీడీ) బృందాలు సమన్వయంతో పాల్గొన్నాయి. సచివాలయంలో ఏవైనా అనుకోని భద్రతాపరమైన ముప్పులు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ భద్రతా, అత్యవసర సేవల విభాగాల సన్నద్ధత, పరస్పర సమన్వయం, స్పందనా సామర్థ్యం, కార్యాచరణ సామర్థ్యాలను అంచనా వేయడం, మరింత బలోపేతం చేయడం ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యం. ఈ విన్యాసంలో వివిధ శాఖలు, విభాగాలకు చెందిన మొత్తం 130 మంది సిబ్బంది పాల్గొన్నారు. వారి విభాగాల వారీగా బందోబస్తు వివరాలు: ఆక్టోపస్ బృందం -- 45 మంది, సీఎస్జీ బృందం -- 18 మంది, అగ్నిమాపక శాఖ -- 08 మంది, లా అండ్ ఆర్డర్ పోలీస్ -- 10 మంది, తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) -- 36 మంది, ట్రాఫిక్ పోలీస్ -- 10 మంది, వైద్య బృందం -- 06 మంది, బాంబ్ డిస్పోజల్ (బీడీ) బృందం అసాల్ట్ డాగ్ -- 04 మంది మొత్తం: 130 మంది సిబ్బంది. ఈ విన్యాసంలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ (అసాల్ట్ కమాండర్) రఘునందన్ రావు, టీజీఎస్పీఎఫ్ సచివాలయం సీఎస్ఓ పి. దేవిదాస్, సచివాలయం ఏసీపీ శంకర్, ఆక్టోపస్ డీఎస్పీ రామకృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ మోహన్ రావు, టీజీఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు పవన్ కుమార్, సత్తయ్య పాల్గొన్నారు.
భద్రతాపరమైన సన్నద్ధతను మరింత పెంపొందించడం, వివిధ సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా సమయాన్ని తగ్గించడం, క్లిష్ట పరిస్థితుల్లో విధుల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడం లక్ష్యంగా ఆక్టోపస్ బృందం ఇలాంటి ఆపరేషనల్ విన్యాసాలు, మాక్ డ్రిల్స్ ను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఈ మాక్ డ్రిల్ ద్వారా తెలంగాణ సచివాలయం భద్రతను పటిష్టంగా నిర్వహించేందుకు, అన్ని అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆక్టోపస్, పాల్గొన్న అన్ని శాఖలు తమ నిబద్ధతను మరోసారి చాటుకున్నాయి. సచివాలయ భద్రత, రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉంటాయని ఈ విన్యాసం స్పష్టం చేసింది.

మహిళలు, చిన్నారుల భద్రతకు వసుంధర బిల్డ్ఎక్స్ అండ

స్పందన కార్యక్రమానికి టాటా ఎలక్ట్రిక్ వాహనం విరాళం

హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 29 :
వ్యాపార విజయాలతో పాటు సామాజిక బాధ్యతకు ప్రాధాన్యతనిస్తూ వసుంధర బిల్డ్ఎక్స్ గ్రూప్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకుంది. మహిళలు, చిన్నారుల రక్షణ మరియు భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (ుజుూజ)కు స్పందన కార్యక్రమం కోసం టాటా ఎలక్ట్రిక్ వాహనాన్ని విరాళంగా అందించింది.ఈ సామాజిక సేవా కార్యక్రమానికి గుర్తింపుగా వసుంధర బిల్డ్ఎక్స్ రెండో తరం పారిశ్రామికవేత్త శ్రీ పి.ఎన్.ఎస్. సందీప్ గారిని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ గారు ఘనంగా సత్కరించారు. శ్రీ సందీప్, వసుంధర బిల్డ్ఎక్స్ వ్యవస్థాపకులు మరియు ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ పోతురెడ్డి రమేష్ బాబు గారి కుమారుడు.ఈ సందర్భంగా శ్రీ రమేష్ బాబు గారి సామాజిక దృక్పథం ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. వ్యాపారం అంటే కేవలం సంపదను సృష్టించడం మాత్రమే కాదని, సమాజానికి తిరిగి ఇవ్వడం, ప్రజల సంక్షేమానికి తోడ్పడటం కూడా అంతే ముఖ్యమని ఆయన విశ్వసిస్తారు. ఆయన చూపిస్తున్న మార్గదర్శకత్వం యువతర పారిశ్రామికవేత్తలకు సామాజిక బాధ్యత పట్ల స్ఫూర్తినిస్తోంది.వ్యాపార అభివృద్ధితో పాటు సమాజ శ్రేయస్సు, మహిళలు మరియు చిన్నారుల భద్రత, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం వసుంధర బిల్డ్ఎక్స్ గ్రూప్ విలువల్లో అంతర్భాగమని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది.సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా బాధ్యతాయుతమైన సంస్థగా తన నిబద్ధతను కొనసాగిస్తూ, సురక్షితమైన మరియు మెరుగైన సమాజ నిర్మాణానికి వసుంధర బిల్డ్ఎక్స్ గ్రూప్ కృషి చేస్తోంది.వసుంధర బిల్డ్ఎక్స్: వ్యాపారంలో విజయం.. సమాజ సేవలో నిబద్ధత.. సురక్షిత భవిష్యత్తు కోసం నిరంతర కృషి!
మీడియా సంప్రదింపులు:
వసుంధర బిల్డ్ఎక్స్
హైదరాబాద్

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన

వచ్చే ఏడాది జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, మంచు తీవ్రత ఉండే ప్రాంతాలు మినహా అన్ని రాష్ట్రాల్లో ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవాలతోపాటు లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్‌లోని మంచు తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జనగణన (జవఅంబం 2027) ఉండదని పేర్కొంది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసింది.
జనగణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1ని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మార్చి ఒకటి నుంచి ఐదో తేదీ వరకు సవరణల కోసం సమయం ఇచ్చారు. ప్రజలు స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి జనవరి 24 వరకు వీలు కల్పించారు. ఆన్‌లైన్ లేదా నిర్దేశిత విధానంలో ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించనున్నారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136